WWW.SAKSHYAM.COM

సత్యం, సమర్థత, విశ్వసనీయత


# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

Telangana

హైదరాబాద్
సోమవారం 01 సెప్టెంబర్ 2025
Published from Hyderabad, Karim nagar & Nalgonda, Vijayawada.

సంపుటి: 16 | సంచిక: 245
పేజీలు: 08 | వెల: రూ.2:00



## సెప్టెంబర్ 10లోగా ఓటర్ల జాబితా ఇవ్వండి

**పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురించాలి**
**కలెక్టర్లకు ఈసీ కీలక ఆదేశాలు జారీ**

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై ఈసీ కసరత్తు

తెలంగాణలో మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు మొదలుపెట్టింది. గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు ప్రచురించాలని ఇటీవల ఆదేశించిన ఎన్నికల

మిగతా 2 లో..



## కమర్షియల్ గ్యాస్ సిలిండర్ పై రూ.51.50 తగ్గింపు

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల ధరలపై శుభవార్త అందించాయి. 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరను రూ.51.50 మేర తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ మార్పు నేటినుంచి అమల్లోకి రానుందని ఓ ప్రకటనలో తెలిపాయి. ఢిల్లీలో సెప్టెంబర్ 1వ తేదీ నుండి

మిగతా 2 లో..

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణం, జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమిషన్ నివేదికపై శాసనసభలో సుదీర్ఘంగా చర్చించిన మీదట తదుపరి విచారణకు ఈ మొత్తం వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు శాసనసభలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు.

"తప్పుడు సమాచారాన్ని పదేపదే హరీశ్‌రావు చెబుతున్నారు. నీళ్లు అందుబాటులో ఉన్నాయని 2009, 2014లో లేఖలు రాశారు. తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు ఉన్నాయని చెప్పినా మీరెందుకు వినలేదు. తెలంగాణ ప్రజల సొమ్ము రూ.లక్ష కోట్లు దోచుకునేందుకే ఇలా చేశారు. మహారాష్ట్రతో చర్చ జరిగింది ప్రాజెక్టు ఎత్తు గురించే. ముంపుప్రాంతం తగ్గుతుందనే ఎత్తు తగ్గించుకోవాలని మహారాష్ట్ర కోరింది. కేసీఆర్‌కు నిజాం కంటే శ్రీమంతుడు కావాలనే దురాశ కలిగిందా"

- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి



# కాళేశ్వరం ప్రాజెక్టు కేసు సీబీఐకి..

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- అవకతవకలపై సీబీఐకి దర్యాప్తు అప్పగిస్తున్నాం
- ప్రాజెక్టుకు సంబంధించి అవినీతిపై కఠిన చర్యలు
- అత్యంత ధనవంతుడు కావాలని కేసీఆర్ ప్లాన్
- కాంట్రాక్టర్లతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు
- దొర అని చెప్పుకునే దోపిడి దొంగ కేసీఆర్
- తెలంగాణ సొత్తు లక్ష కోట్లు కొల్లగొట్టారు
- ప్రజాస్వామ్య దేశం కనుక నడి బజారుకీడ్చలేదు
- రాళ్లతో కొట్టి చంపలేదు.. ఉరి తీయలేదు
- కాళేశ్వరం మీద 49 వేల కోట్లు అప్పులు
- ఆ అప్పులలో కొంత అసలు మేం చెల్లించాం
- ఇంకా 47 వేల కోట్లు ఉంటే ప్రాజెక్టు పూర్తి
- ప్రాజెక్టు అప్పులపై బారం తగ్గించేందుకే ఢిల్లీకి

**తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి**

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పుట్టుకతోనే దొర అని చెప్పుకునే కేసీఆర్ దోపిడి దొంగగా మారి తెలంగాణ సొత్తు లక్ష కోట్లు కొల్లగొడితే ప్రజాస్వామ్య దేశం కనుక నడి బజారులో రాళ్లతో కొట్టి చంపలేదు. ఉరి తీయలేదు. విచారణ చేసి చర్యలు తీసుకునేందుకు అభిప్రాయం కోరాం. దాన్ని మా బలహీనతగా అపహాస్యం చేశారు. భవిష్యత్ తరాలు మమ్మల్ని తప్పుపట్టకుండా ఉండాలని బాధ్యతగా వ్యవహరించాం. కాళేశ్వరం మీద 49 వేల కోట్లు

మిగతా 2 లో..



# ఇక మనం.. భాగస్వాములం

- విభేదాలు వివాదాలుగా మారకూడదు
- సరిహద్దుల్లో శాంతిమంత్రం అవసరం
- ప్రజల మధ్య సంబంధాలను పెంచుదాం
- ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- ఎస్‌సీవో సదస్సు వేదికగా ఇరువురి భేటీ
- బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్‌కు మోదీ ఆహ్వానం

భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సు సందర్భంగా చైనాలోని తియాంజిన్‌లో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో

మిగతా 3 లో..

## బీఆర్‌ఎస్‌తో మ్యాచ్ ఫిక్సింగ్

- కాంగ్రెస్, బీఆర్ఎస్ లు అసెంబ్లీలో డ్రామాలు
- కాళేశ్వరం కమిషన్ పేరుతో నాటకాలాడుతున్నాయి
- కేవలం ఐవాష్ కోసం మాత్రమే కాళేశ్వరం కమిషన్
- అవినీతి గురించి ఎక్కడా నివేదికలో ప్రస్తావించలేదు
- అలా చెప్పనప్పుడు కమిషన్ ఎందుకు వేశారు
- అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



తెలంగాణ అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదికపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు తారాస్థాయికి చేరితే.. బిజెపి మాత్రం ఈ రెండు పార్టీలకు షాకిచ్చేలా వ్యవహరించింది. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ.. కేసీఆర్ ను అరెస్ట్ చేయమంటూ రేవంత్ రెడ్డి ప్రకటించినప్పుడు,

మిగతా 3 లో..

## కమిషన్ ఏం చేసింది..? నివేదికతో ఏం జరిగింది?

**చర్యలు, నిర్ణయం తీసుకోనప్పుడు అధికారం ఎందుకు?**
**ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టిన అక్బరుద్దీన్ ఒవైసీ**

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన కమిషన్ ఏం చేసింది, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికతో ఏం జరిగిందని అక్బరుద్దీన్ ప్రశ్నించారు. దీనిపై చర్యలు తీసుకోకపోతే కమిషన్ వేసి ఏం లాభం ఉందని, ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై ఏ నిర్ణయం, చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును స్క్రాప్ చేస్తారా,

మిగతా 3 లో..

# కాళేశ్వరం నివేదిక ఓ చెత్త కాగితం

## కమిషన్ నిబంధనలు పాటించలేదు

- మేము కోర్టుకు వెళ్లాము.. అది మా హక్కు
- 8బి, 8సి క్రింద నోటీసులు ఎదుకు ఇవ్వలేదు?
- పంచాయితీ ఎన్నికలకోసమే బురద రాజకీయాలు
- పీసీ ఘోష్ కమిషన్ విచారణ చట్టబద్ధం లేదు
- చట్టబద్ధంగా జరిగిందా లేదా సభలో చర్చించాలి
- కమిషన్ విచారణలో లోపాలు స్పష్టంగా ఉన్నాయి
- అసెంబ్లీలో హరీష్ రావు కీలక వ్యాఖ్యలు



కాళేశ్వరం కమిషన్ నివేదికపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ ముందుగా ఊహించినట్లుగానే సెగలు పుట్టించింది. నివేదకలో గత ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై మాజీ మంత్రి హరీష్ రావు స్పందిస్తూ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. మొదట యూరియా సమస్యను చర్చించే ప్రయత్నం చేసిన హరీష్ రావును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అడ్డుకున్నారు. యూరియా సమస్య ఇప్పుడు వద్దు కాళేశ్వరం గురించి మాత్రమే మాట్లాడండి అంటూ అభ్యంతరం తెలపడంతో తిరిగి కాళేశ్వరం నివేదికపై హరీష్ రావు వివరణ ఇస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రభుత్వం ఇంత ఆదరాబాదరగా ఆదివారం అసెంబ్లీ పెట్టి కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై చర్చపెట్టారంటేనే వీరి ఉద్దేశ్యం ఏంటో అర్థమవుతోంది. కమిషన్ నిబంధనలు పాటించలేదని మేము కోర్టుకు వెళ్లాము. అది మా హక్కు. కమిషన్ రిపోర్టు క్వాష్ అవుతుందనే భయంతోనే ఈరోజు రిపోర్టు అసెంబ్లీలో పెట్టడంతోనే మీ కుట్ర ప్రజలకు అర్ధమవుతోంది. పంచాయితీ

మిగతా 2 లో..

## స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం

# రిజర్వేషన్ బిల్లులకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం

**రాబోయే ఎన్నికల్లో అమలు చేస్తామన్న ప్రభుత్వం**
**బీసీ రిజర్వేషన్లకు బీఆర్ఎస్సే అడ్డంకి**
**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపణ**

తెలంగాణ స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 42 శాతం రిజర్వేషన్లు కల్పించే కీలక సవరణ బిల్లులకు రాష్ట్ర అసెంబ్లీ ఆదివారం ఆమోదం తెలిపింది. తీవ్ర వాదోపవాదాల నడుమ తెలంగాణ మున్సిపాలిటీల (మూడవ సవరణ) బిల్లు-2025, తెలంగాణ పంచాయతీరాజ్ (మూడవ సవరణ) బిల్లు-2025లను సభ వాయిస్ ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం నడిచింది. అసెంబ్లీ సమావేశాల రెండో రోజున ప్రభుత్వం ఈ రెండు బిల్లులను సభ ముందుకు తెచ్చింది. స్థానిక సంస్థల్లో మొత్తం రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించి, బీసీలకు 42 శాతం కోటా కల్పించడమే ఈ బిల్లుల ముఖ్య ఉద్దేశం.

మిగతా 3 లో..

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల

# వాకౌట్

**కాళేశ్వరం నివేదికపై చర్చలో తీవ్ర గందరగోళం**
**మాట్లాడే అవకాశం ఇవ్వలేదంటూ నిరసన**
**కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి కుట్ర..**
**మరో భారీ ఉద్యమం చేస్తాం**
**మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు**



కాళేశ్వరం ప్రాజెక్టుపై జరిగిన చర్చ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది.

మిగతా 3 లో..

# సంపాదకీయం

## కోర్టుతీర్పులు స్థానిక భాషల్లో విడుదల చేయాలి

మన న్యాయవ్యవస్థ ఇంకా బ్రిటిష్ కాలంనాటి పరిస్థితులకు అనుగుణంగానే సాగుతోంది. న్యాయ వ్యవస్థతో పాటు చట్టాలు, శిక్షల్లో భారతీయాకరణ జరగాల్సి ఉంది. కొత్త చట్టాలు ప్రవేశ పెట్టిన దరిమిలా దీనిపై చర్చ చేయాలి. రాజకీయ నాయకుల నేరాలకు సంబంధించి ఇటీవల పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ప్రవేశ పెట్టిన దరిమిలా అనేక అంశాలపై చర్చించాలి. అలాగే గవర్నర్లు, రాష్ట్రపతి బిల్లుల ఆమోదంలో కాల పరిమితి విధించిన సుప్రీం కోర్టు, తన విషయంలోనూ పరిమితి విధించుకోవాలి. ఏళ్ల తరబడి కేసులు నడవడం, తీర్పులు వచ్చే సరికి కొందరు మరణించడం జరుగుతోంది. ఒక్కో కేసు పరిమిత కాలంలో ముగించేలా సంస్కరణలు రావాలి. ఏ కేసయినా ఏడాదికి మించకుండా చూడాలి. సిబిఐ, ఇడి దాడుల కేసుల్లో కూడా సత్వర విచారణ జరగడం లేదు. ఎపికి సంబంధించి వివేకా హత్య కేసు ఆరేడేళ్లుగా ఎటూ తేలలేదు. సిబిఐ విచారణ జరిపినా దోషులు ఎవ్వరన్నది తేల్చలేదు. ఇకపోతే జగన్ ఐదేళ్లు బెయిల్ మీద ఉంటూ పాలన చేశారు. అనేక కేసులు ఇంకా కొలిక్కి రాలేదు. కెసిఆర్ అవినీతిపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఎలూ తేల్చలేదు. సత్వరంగా కేసులను విచారించి దోషులకు కేసు పడేలా చేయాలి. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేసులో పరస్పర విరుద్ధ తీర్పులు ఇవ్వడమే గాకుండా 17 ఏళ్లుగా కోర్టులో నానింది. రాజకీయ నాయకుల కేసుల విషయంలో మరీ త్వరగా తీర్పులు రావాలి.ఎందుకంటే పెరుగుతున్న నేరాలు, కొత్తకొత్త మోసాలు, ఐటి మోసాలు, అత్యాచారాలు వంటి వాటిని పరిశీలించి చట్టాల ను మార్పు చేసుకోవాల్సి ఉంది. హత్యాచారం ఘటనలు మళ్లీ మ్లీ జరుగుతూనే ఉన్నాయి. అత్యాచారాలపై ప్రజల్లో భయం లేకుండా పోతున్నది. లిక్కర్ కేసులో సత్వర విచారణ సాగడం లేదు. నేతల అవినీతిపైనా విచారణ సాగడం లేదు. ఇప్పటివరకు పనిచేసిన న్యాయమూర్తులు ఆయా సందర్భాల్లో తమ విలువైన సూచనలు చేశారు. వాటిని సలహాలుగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలి. ప్రజలకు ఏంచేస్తే సత్వర న్యాయం అందుతుందో ఆలోచించాలి. అవసరమైతే మాజీ ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల సలహాలు తీసుకోవాలి. ప్రతిపేదవాడికి న్యాయం అందించడమే న్యాయమూర్తి ప్రధాన లక్ష్యం కావాలి. దేశంలో న్యాయం పట్ల జరుగుతున్న ఆలస్యాన్ని గుర్తించి సత్వర న్యాయం అందేందుకు అసవరమైన చర్యలను చేపట్టాలి. నిర్ణీత కాలంలోగా న్యాయ విచారణలు, తీర్పులు వచ్చేలా నట్టబద్దం చేసుకోవాలి. ఇదే సందర్భంలో పెండింగ్ కేసులు సమస్యగా మారాయని కూడా గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. ప్రతి తీర్పులోనూ ప్రజలకు న్యాయం జరిగిందన్న భావన కలగించాలి. రాజకీయ నాయకుల కేసుల విషయంలో త్వరగా విచారణ జరిపి శిక్షలు వేస్తే మంచిది. కోర్టు తీర్పులను అమలు చేయని ప్రభుత్వాలపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి. ఇటీవల పలువురు సుప్రీం చీఫ్ జస్టిస్‌లుగా పనిచేసిన వారు న్యాయవ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇవన్నీ కూడా పేదలకు సత్వర న్యాయం అందాలన్న తపనతో చేసినవే తప్ప మరోటి కాదు. భారత న్యాయ వ్యవస్థ సాధారణ ప్రజలకు ఎంతో దూరంలో నిలిచిందన్న ఆరోపణల్లో వాస్తవాలను గుర్తించాలి. ఇప్పటికీ కోట్ల మంది అణగారిన వర్గాల ప్రజలకు న్యాయ సహాయం అవసరం ఉంది. తమకు అన్యాయం జరిగిందని భావించిన ప్రతి వారూ కోర్టులకు వెళ్లడం లేదు. ఎందుకంటే కోర్టులకు వెళితే తేలేదేమీ లేకపోగా అనవసర కాలయాపన, డబ్బులు దండగ అన్న భావనలో ప్రజలు ఉన్నారు. అవసరమైన వెంటనే న్యాయ వ్యవస్థను ఆశ్రయించడానికి ఇంకా వారు జంకుతూనే ఉన్నారు. న్యాయవ్యవస్థ రాజ్యాంగబద్ధమైన విధులు నిర్వర్తి స్తున్నప్పటికీ నిర్ణీత కాలవ్య వధిలో కోర్టుల్లో కేసులు తేలడంలేదు. తీర్పులు వచ్చాక అమలు కావడం లేదు.అంబేద్కర్ మహాశయుడి ఆలోచనలకు అందని విధంగా మన రాజకీయాలు మారుతున్నాయి. సామాన్యులకు న్యాయం అందకుండా పోతోంది. నిరంతరం రాజకీయ కేసులు తప్ప సామాన్యుల పక్షాన న్యాయవ్యవస్థ బలంగా నిలబడడం లేదు. నేటికీ ఎందరో చేయని నేరాలకు జైళ్లలో మగ్గుతున్నారు. ఇలాంటి వారిని ఎలా బయటకు తీసకుని వస్తారన్నది కూడా ముఖ్యం. అలాగే ఎలాంటి కేసునైనా కనీసం 3నెలల్లో ముగించి తీర్పును ఇచ్చేలా కఠిన చట్టాలను అమలు చేయాలి. తెలంగాణలో పలువురు ఎమ్మెల్యేలపై అనర్హత కేసును మూడు నెలల్లో తేల్చాలని సుప్రీం ఆదేశించింది. నిజానికి ఎన్నికలయిన ఓ నెలరోజుల్లోగా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఏవైనా కేసులు ఉంటే తేల్చేయాలి. ఏళ్లతరబడి కేసునలు నాన్చేయడం వల్ల ఐదేళ్ల పుణ్యకాలం గడిచిపోతోంది. చిట్టచివరకు ఎన్నికల ముందు తీర్పులు వ్యతిరేకంగా వచ్చినా చేయగలిగేది ఏమీ లేదు. కనుక వీటిపైనా దృష్టి సారించాల్సి ఉంది. న్యాయవ్యవస్థలో సమూల మార్పులు జరగాలని గుర్తు చేసుకోవాలి. ప్రధానంగా స్థానిక భాషల్లో కోర్టు కార్యకలాలపాలు సాగాలి. కోర్టుల్లో న్యాయ చర్చలను స్థానిక భాషల్లో చర్చించేలా చట్టం చేసుకోవాలి. గతంలో ప్రధాని మోడీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాబట్టి ఇప్పుడీ విషయంపై చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అర్థంకాని భాషలో కాకుండా ప్రజలకు అర్థం అయ్యే భాషలో న్యాయచర్చలు సాగాలి. కోర్టుతీర్పులు స్థానిక భాషల్లో విడుదల చేయాలి. పాలకులు పేదలకు న్యాయన్ని చేరువ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి. అనేక సంస్కరణలు తీసుకుని వచ్చామని చెబుతున్న ప్రధాని మోడీ ఈ న్యాయవ్యవస్థలో ఉన్న లోటుపాట్లను గుర్తించి తక్షణ చర్యలకు పూనుకోవాలి. పార్లమెంట్ వేదికగా దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. వివేకానందరెడ్డి హ్యతకేసు, కోడికత్తి కేసులు తీసుకుంటే ఎంతలా జాప్యం జరుగుతుందో చూడవచ్చు. పోలీసుల విచారణలో జాప్యం.. కోర్టుల్లో జాప్యం వంటివన్నీ పోవాలి. కేసు తీవ్రతను బట్టి సత్వర విచారణ, తీర్పులు రావాలి. ఇందుకు అవసరమైతే.. మనదేశం వేల ఏళ్లుగా అనుసరించిన రాజ్యాంగ వ్యవస్థలను, న్యాయవ్యవస్థలను, ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి. నిజానికి కోర్టులు, రాజ్యాంగం పట్ల ప్రజలకు సరైన అవగాహన లేదు. ప్రజలను కోర్టులకు చేరువ చేయడం రాజ్యాంగ విధి కావాలి. రాజ్యాంగం అంటే పాలకులకు సంబంధించిన వ్యవహారంగా ఉండరాదు. న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు, విశ్వాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించాలి. లోకల్ కోర్టులను పెంచి సత్వర న్యాయం కలిగించాలి. మన న్యాయవ్యవస్థ, ప్రొసీడింగ్స్ ఇంకా ఆంగ్లేయులనాటి విధానాలనే అవలంబిస్తోందన్న ఆరోపణల నుంచి బయటపడి పటిష్టమైన న్యాయ చట్టాలను రూపొందిం చాలి. దీనిని ప్రాతిపదికగా తీసుకుని మన పాలకులు న్యాయవ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. సత్వర న్యాం అందడం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ఎలాంటి కేసయినా ఓ యేడాదిలోగా ముగిస్తే మంచిదన్న భావనలో విచారణలు సాగాలి.

# కాళేశ్వరం ప్రాజెక్టు కేసు సీబీఐకి..



మొదటిపేజీ తరువాయి..

అప్పులు, కొంత అసలు చెల్లించాం. ఇంకా 47 వేల కోట్లు ఉంటే ప్రాజెక్టు పూర్తవుతుంది. ప్రాజెక్టుల అప్పులపై బారం తగ్గించేందుకు నేను ఢిల్లీకి వెళ్లాను. ప్రధాని మోదీని కలవడం వల్ల 26500 కోట్లను 11.9 రేట్ వడ్డీకి కేసీఆర్ తెచ్చిన అప్పును 7.25 శాతానికి తగ్గించి 30 ఏళ్లకు పొడిగించి డెట్ రీస్ట్రక్చర్ చేపించా. ఏడాదికి రూ.4 వేల కోట్లు ఆదా అవుతుంది. 30 ఏళ్లకు లక్షా 20 వేల కోట్లు ఆదా అవుతుంది. ఈ విషయంలో ఎవరినీ వదిలేది లేదని, తుది నిర్ణయం తీసుకున్న తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరినీ వదిలేది లేదు. అవినీతిపరులపై చర్యలకు సరైన నిర్ణయం తీసుకుంటాం. నిర్ణయం తీసుకున్నాకే ఇక్కడి నుంచి బయటకు వెళతాం. నిజాం ప్రపంచంలో అత్యంత ధనవంతులలో ఒకరు కాగా, గత బీఆర్ఎస్ పాలకులు అంబానీ, అదానీ కంటే ఎక్కువ సంపాదించాలనే ఆశతో సొంత నిర్ణయాలతో కాళేశ్వరం లాంటి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయిస్తున్నాం" అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అక్బరుద్దీన్ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ, "కాళేశ్వరం నివేదికను పూర్తిగా చదవకుండానే మాపై ఆరోపణలు చేయవద్దు. మీరు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి ఇక్కడ సిద్ధంగా ఉన్నాం. ఎన్‌డీఎస్ఏ, విజిలెన్స్ రిపోర్ట్, కాగ్ నివేదికలను కూడా కమిషన్‌కు అందించాం. కమిషన్ అందరి సరికాదని" రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. జస్టిస్ ఘోష్ కమిషన్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి "8బీ, 8సీ కింద నోటీసులు ఇవ్వలేదని కేసీఆర్, హరీశ్ రావు కోర్టును ఆశ్రయించారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక చెల్లదని పిటిషన్ వేశారు. కమిషన్‌పై కూడా కోర్టుకు వెళ్లారు. వారు ఇప్పటివరకు 8బీ, 8సీ ప్రకారం నోటీసులు ఇచ్చామని కోర్టులో చెప్పినవారే. అవినీతి సొమ్మును రికవరీ చేయాలంటే ఏ సంస్థ ద్వారా చేయాలో సిట్ వేయాలా లేక సీఐడీ, ఐటీ, ఈడీ, సీబీఐ ద్వారానా అని పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం" అన్నారు. కమీషన్ల కోసం పై నుంచి కిందకు రావాల్సిన నీళ్లను, మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టి కింద నుంచి పైకి ఎన్నో లిఫ్టులు ద్వారా ఎత్తిపోశారు. 3400 మెగావాట్ల యూనిట్ల అవసరం పడేచోట బీఆర్ఎస్ నిర్ణయాలతో 8400 మెగావాట్ల యూనిట్ల విద్యుత్ కు పెరిగిందన్నారు. కాంట్రాక్టర్ల కోసం లిఫ్టులు పెరిగాయి. 162 టీఎంసీల నీరు మాత్రం పెరగలేదు. 38 వేల కోట్లతో పోవాల్సిన ప్రాణహిత ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుగా చేసి ఏకంగా ఒక లక్షా 47 వేల కోట్లకు ఖర్చు పెరిగిందని రేవంత్ ఆరోపించారు. అత్యంత నైపుణ్యం ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్డీఎస్ఏ కమిటీ కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలను గుర్తించింది. ఇంజినీర్ల నిర్ణయాలు కాకుండా, నేతలు తీసుకున్న నిర్ణయాలే ప్రాజెక్టులో లోపాలు, అవకతవకలకు కారణమయ్యాయని రేవంత్ విమర్శించారు.



అవుతుంది. కాళేశ్వరానికి ఏడాదికి రూ.13 వేల కోట్లు ఆదా అవుతుంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా, ఎంఐఎం శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ లేవనెత్తిన అంశాలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిసమాధానమిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చోటుచేసుకున్న అవినీతి, అవకతవకల అంశాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టులు కట్టారని" తీవ్ర విమర్శలు చేశారు. "లక్ష కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది. నీటి కోసం పోరాడి ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాం. బంగారం కంటే నీరు మాకు ముఖ్యమైంది. కాళేశ్వరంలోని మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌లపై ఇప్పటికే విచారణ చేపట్టాం. జస్టిస్ పీసీ ఘోష్ అనుభవం ఉన్న న్యాయమూర్తి. అనేక తీర్పులు ఇచ్చిన ఆయనకు కాగ్, విజిలెన్స్, ఇతర దర్యాప్తు సంస్థల నివేదికలు అందించాం. నుండి వివరాలు సేకరించి రిపోర్ట్ ఇచ్చింది. కనుక వాస్తవాలు వక్రీకరించి మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదు. మీ సూచనలు, సలహాలు తీసుకోవడానికి కమిషన్ రిపోర్ట్ మీ ముందుంచాం. అవినీతిపరులపై కఠిన చర్యలు తప్పవు. ప్రతి విషయం నివేదికలో ఉండకపోవచ్చు. అక్బరుద్దీన్ ఒవైసీ నాకు మిత్రుడు కావచ్చు, నామీద జోకులు వేయొచ్చు, కానీ ప్రభుత్వంపై జోకులు వేయడం

# కాళేశ్వరం నివేదిక ఓ చెత్త కాగితం




మొదటిపేజీ తరువాయి..

ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే కమిషన్ రిపోర్టు పేరుతో బురద రాజకీయాలు చేస్తున్నారు. పీసీ ఘోష్ కమిషన్ విచారణ చట్టబద్ధంగా జరిగిందా లేదా అనేది సభలో చర్చించాలి. ఫెయిర్ నెన్ అండర్ కమిషన్ ఎంక్వరీ యాక్ట్ 1952 ప్రకారం నిష్పక్షపాతంగా కమిషన్ విచారణ జరగకపోతే అది చిత్తుకాగితంతో సమానం అని చట్టమే చెబుతోంది. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు. ఒక సభ్యుడిపై ఆరోపణలు చేయాలంటే ముందుగా 8బి, 8సి క్రింద నోటీసులు ఇస్తేనే అది చెల్లుతుంది, లేదంటే చెల్లదు. ఘోష్ కమిషన్ మా హక్కులు కాలరాశారు. మాపై వస్తున్న ఆరోపణలకు మా వద్ద వివరణ తీసుకోకుండానే నివేదిక ప్రభుత్వానికి ఇచ్చారు. నాకు, కేసీఆర్ కు ఎవరికీ క్రాస్ ఎగ్జామిన్ కు నోటీసులు ఇవ్వలేదు. కమిషన్ విచారణలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ముందునుంచే కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం చేసారు. కోర్టుల్లో కేసులు వేసి, భూసేకరణకు సైతం అడ్డుపడ్డారు. ఇప్పుడు ఈ నివేదిక కూడా అందుకే వేశారు. ఈ నివేదికను పొలిటికల్ వ్యపన్ గా వాడుతున్నారు. చట్టపరిధిలో నిష్పక్షపాతంగా విచారణ జరపలేదు. మాకు 8బి క్రింద నోటీసులు ఇవ్వలేదు. ఘోష్ కమిషన్ నివేదిక చెల్లదు. గతంలో అనేక కమిషన్లు 8బి క్రింద నోటీసులు ఇవ్వకపోతే కోర్టులు నివేదికలను కొట్టివేశాయి. ఇది చెత్త రిపోర్టు, తప్పుడు రిపోర్టు అన్నారు. హరీష్ రావు మాట్లాడుతుండగా కల్పించుకున్న మంత్రి శ్రీధర్ బాబు కోర్టులో అన్ని విషయాలు త్వరలో తేలతాయన్నారు. కోర్టులో ఉన్న టెక్నికల్ అంశాలు గురించి మీరు మాట్లతున్నారు. అవి కోర్టు ముందు ఉన్నాయి. చట్టపరంగా తేలుతాయి. మేము అడుగుతున్నది కమిషన్ చూపించిన లోపాల గురించి మాత్రమే సభలో మాట్లడండి అన్నారు. మా బాధ్యతలో భాగంగా సభలో నివేదిక పెట్టాము. పార్టీ పరంగా అనవసర విమర్శలు చేయొద్దన్నారు. మేము కేసీఆర్ ప్రభుత్వంపై కక్ష సాధించాలంటే పారదర్శకంగా కమిషన్ లు ఏర్పటు చేసేవాళ్లం కాదు. కమిషన్ నివేదిక పేరుతో రెండేళ్లు ఆగేవాళ్ల కాదన్నారు. తిరిగి మైక్ అందుకున్న హరీష్ రావు మాట్లడుతూ తెలంగాణ రైతుల కష్టాలు తీర్చే కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన తప్పుడు నివేదిక ఇది. మేము రిపోర్టను క్వాష్ చేయమని మాత్రమే కోర్టుకు వెళ్లాము. అసెంబ్లీలో రిపోర్టు పెట్టొద్దని మేము వెళ్లలేదన్నారు. తుమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు ప్రాజెక్టు మార్చడం వెనుక కుట్ర ఉందని రిపోర్టులో చెబుతున్నారు. కానీ 120 టీఎంసీల నీళ్లు తుమ్మిడిహట్టి వద్ద లేవని సెంట్రల్ వాటర్ కమిషన్ లేఖ ఇచ్చింది. ఇది మా లబ్ధికోసం మార్చలేదని హరీష్ రావు స్పష్టం చేశారు. ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఒక ట్రాష్. ఘోష్ కమిషన్ రిపోర్ట్ ని చెత్త బుట్టలో వేశాం. అసెంబ్లీలో సాక్ష్యాధారాలు సహా ఏకపక్షంగా ఘోష్ కమిషన్ ఏ రకంగా నివేదిక ఇచ్చిందనేది మేము వివరించాం. దాన్ని తట్టుకోలేక ముఖ్యమంత్రితో సహా ఎనిమిది మంది మంత్రులు 33 సార్లు మా ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. సభలో మేము మైక్ కావాలని దాదాపు గంటన్నర సేపు స్పీకర్‌ను, మంత్రిని అడిగినా ఇవ్వలేదు' అని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఒక ట్రాష్. ఘోష్ కమిషన్ రిపోర్ట్ ని చెత్త బుట్టలో వేశాం. అసెంబ్లీలో సాక్ష్యాధారాలు సహా ఏకపక్షంగా ఘోష్ కమిషన్ ఏ రకంగా నివేదిక ఇచ్చిందనేది మేము వివరించాం. దాన్ని తట్టుకోలేక ముఖ్యమంత్రితో సహా ఎనిమిది మంది మంత్రులు 33 సార్లు మా ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. సభలో మేము మైక్ కావాలని దాదాపు గంటన్నర సేపు స్పీకర్‌ను, మంత్రిని అడిగినా ఇవ్వలేదు' అని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ పాలనలో ఒక ఎకరానికి నీళ్లు ఇయ్యలేదని చెప్పిన భట్టి విక్రమార్క రుజువు చేస్తే నేను నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా' అని హరీశ్ రావు సవాల్ చేశారు. 'బీఆర్ఎస్ సమయంలో నీళ్లిచ్చినట్టు ప్రూవ్ చేస్తే మీరు డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేస్తారా?' అని నిలదీశారు. '10 సంవత్సరాల్లో 17 లక్షల ఎకరాలకు నీళ్లు అందించాం. మీరు ఒక్క ఎకరానికి ఇవ్వలేదని మాట్లాడితే రా దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టండి. ఎవరు అబద్ధాలు మాట్లాడుతారో తేలుద్దాం' అని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఛాలెంజ్ చేశారు.ఒక ఎకరానికి నీళ్లు ఇవ్వలేదు అని అబద్ధాలు ఆడింది కాంగ్రెస్ పార్టీ. 17 లక్షల ఎకరాల కొత్త అయకట్టు, 20 లక్షల ఎకరాలు స్టేబిలైజేషన్ చేశాం. మొత్తం 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. ప్రాణహిత ప్రాజెక్ట్ ని అంతర్రాష్ట్ర సమస్యల్లో ఇరికించారు. ఎక్కడైతే సమస్యలు లేవో వాటిని కొనసాగించాం. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు అందించాం. ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం' అని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. 'రూ.4000 కోట్లు ఖర్చు చేసి పాలమూరు జిల్లాలో ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లు అందించాం. మేము అడుగుతున్న ప్రశ్నలకు, మేము చూపిస్తున్న ఆధారాలకు తట్టుకోలేక మా మైక్ కట్ చేశారు. 38 మంది ఉన్న బీఆర్ఎస్ పార్టీకి మాట్లాడేందుకు అసెంబ్లీలో అవకాశం ఇవ్వరా?' అని ప్రభుత్వ తీరుపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో రాష్ట్రంలో ఏర్పడిన వరదల గురించి మాట్లాడదాం,

## సెప్టెంబర్ 10లోగా ఓటర్ల జాబితా ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి..

సంఘం తాజాగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓటర్ల, పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురించాలని ఈసీ కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబరు 10వ తేదీ నాటికి అంతా సిద్ధం చేయాలని ఉత్తర్వులలో పేర్కొంది.





ఈసీ ఉత్తర్వుల ప్రకారం..ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల వారీగా ఓటర్ల, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలు సెప్టెంబరు 6న ప్రచురించాలి. సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు వాటిపై అభ్యంతరాలు, వినతుల స్వీకరించనున్నారు. ఆపై సెప్టెంబర్ 8న జిల్లా స్థాయిలో కలెక్టర్లు, మండల స్థాయిలో ఎంపీడీవోలు రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించాలి. సెప్టెంబర్ 9న ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాలపై వచ్చిన అభ్యంతరాలు, వినతులు పరిష్కరించాల్సి ఉంటుంది. చివరగా సెప్టెంబర్ 10న ఎంపీటీసీ, జడ్పీటీసీ తుది ఓటర్ల జాబితా, తుది పోలింగ్ కేంద్రాల జాబితాలు ముద్రించాలని ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల ఫోటో ఎలక్ట్రోరల్ రోల్స్‌ను సిద్ధం చేసి, సెప్టెంబర్ 2న తుది జాబితా విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రక్రియను రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-కే కింద, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం%-%2018లోని సెక్షన్ 10 మరియు 11 ప్రకారం చేపట్టారు. ఈ ప్రక్రియలో 2025 జూలై 1ను అర్హత తేదీగా తీసుకున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఫోటో ఓటర్ల జాబితాలను ఆధారంగా చేసుకుని గ్రామ పంచాయతీ వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారులతో అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ ఆగస్టు 31తో ముగియనుందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీల వార్డుల వారీగా తుది ఫోటో ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. ఇందుకు సంబంధించి, ఆగస్టు 28న పంచాయతీ స్థాయిలో ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అదేరోజు జిల్లాస్థాయి రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. ఆగస్టు 29న మండల స్థాయిలో మరో సమావేశం జరుగుతుంది. అభ్యంతరాలను ఆగస్టు 28 నుంచి 30 వరకు స్వీకరించి, సెప్టెంబర్ 2న తుది జాబితాను ప్రకటిస్తారు. హైదరాబాద్, మేడ్చల్%-%మల్కాజిగిరి జిల్లాలను మినహాయించి మిగతా అన్ని జిల్లాల్లోని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు (లోకల్ బాడీస్), డీపీవోలు, ఎంపీడీవోలు తగిన చర్యలు చేపట్టాలని ఎన్నికల కమిషన్ సూచించింది.

## కమర్షియల్ గ్యాస్ సిలిండర్ పై రూ.51.50 తగ్గింపు

మొదటిపేజీ తరువాయి..

19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1580కి దిగొచ్చింది. అయితే, 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ల ధర లో ఎలాంటి మార్పులు లేవని తెలిపింది. దాంతో డొమెస్టిక్ సిలిండర్ వినియోగదారులు మరోసారి నిరాశకు లోనయ్యారు. హైదరాబాద్‌లో 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.905 వద్ద స్థిరంగా ఉండగా, హైదరాబాద్‌లో 19 కేజీల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1800.5కి దిగొచ్చింది. డొమెస్టిక్ 5 కేజీల సిలిండర్ ధర రూ.335.50గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.853 వద్ద స్థిరంగా ఉండగా, ఢిల్లీలో 19 కేజీల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1580 అయింది. డొమెస్టిక్ 5 కేజీల సిలిండర్ ధర రూ.317.50గా ఉంది.



### స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం

# రిజర్వేషన్

మొదటిపేజీ తరువాయి..

చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వమే బీసీ రిజర్వేషన్ల పెంపునకు ప్రధాన అడ్డంకిగా మారిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పంచాయతీరాజ్ చట్టం-2018, మున్సిపాలిటీల చట్టం-2019 వల్లే రిజర్వేషన్లు 50 శాతానికి మించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. బీసీల సాధికారతకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. మరోవైపు బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వానికి నిజాయతీ లేదని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం మార్చిలో ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం పొందడానికి ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ అంశంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటులో ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ఈ ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. తమ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, కులగణన సర్వే నిర్వహించామని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగానే మార్చిలో రెండు బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపామని, అవి గత ఐదు నెలలుగా రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈలోగా ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రయత్నిస్తే, ప్రతిపక్షం గవర్నర్‌ను ప్రభావితం చేసి అడ్డుకుందని ఆరోపించారు. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ కోసం ఐదుసార్లు లేఖలు రాసినా స్పందన లేదని, అపాయింట్‌మెంట్ ఇప్పించేందుకు సాయం చేయాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్‌ను కోరారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుంటే, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అడ్డుపడుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30లోపు పూర్తి చేయాలన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పురపాలక, పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లుపై శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీఆర్ఎస్, గవర్నర్ తీరు కారణంగానే జాప్యం జరుగుతోందని ఆయన విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం రెండు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్‌కు పంపిందని రేవంత్ గుర్తుచేశారు.



# ఇక మనం.. భాగస్వాములం

మొదటిపేజీ తరువాయి..

ఇరు దేశాల మధ్య నెలకొన్న పలు కీలక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. భారత్, చైనాలు పరస్పరం పోటీదారులు కావని, అభివృద్ధిలో భాగస్వాములని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాదాలుగా మారకూడదని వారు బలమైన ఏకాభిప్రాయానికి వచ్చారు. గత ఏడాది (2024) రష్యాలోని కజన్‌లో జరిగిన సమావేశం తర్వాత ద్వైపాక్షిక సంబంధాలలో సాధించిన పురోగతిని మోదీ, జిన్‌పింగ్ ఈ సందర్భంగా సమీక్షించారు. ఇరు దేశాల మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు కొనసాగడం ఆర్థిక వృద్ధికి, ప్రపంచంలో బహుళ ధ్రువ వ్యవస్థకు ఎంతో ముఖ్యమని వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా, ద్వైపాక్షిక సంబంధాలు నిరంతరం అభివృద్ధి చెందాలంటే సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత అత్యంత కీలకమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. గత ఏడాది సరిహద్దుల నుంచి ఇరు దేశాల సైన్యాలు విజయవంతంగా వైదొలగడం, అప్పటి నుంచి శాంతియుత వాతావరణం కొనసాగుతుండటంపై నేతలిద్దరూ సంతృప్తి వ్యక్తం చేశారు. సరిహద్దు వివాదానికి సంబంధించి ఇరు దేశాల ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాజకీయ కోణంలో న్యాయమైన, సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు కట్టుబడి ఉన్నామని వారు స్పష్టం చేశారు. ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంపొందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇందులో భాగంగా, నిలిచిపోయిన ప్రత్యక్ష విమాన సర్వీసులను పునరుద్ధరించడం, వీసా విధానాలను సులభతరం చేయడం వంటి చర్యలు చేపట్టాలని అంగీకరించారు. ఇటీవల కైలాస మానససరోవర యాత్ర, పర్యాటక వీసాలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్థిక, వాణిజ్య సంబంధాలపై కూడా లోతైన చర్చ జరిగింది. ప్రపంచ వాణిజ్యాన్ని స్థిరీకరించడంలో భారత్, చైనా ఆర్థిక వ్యవస్థలు పోషించగల కీలక పాత్రను ఇరువురు నేతలు గుర్తించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, పెట్టుబడులను విస్తరించుకోవడంతో పాటు, వాణిజ్య లోటును తగ్గించే దిశగా రాజకీయ, వ్యూహాత్మక మార్గనిర్దేశంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని వారు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేశారు. "భారత్, చైనా రెండూ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని అనుసరిస్తాయి. మన సంబంధాలను మూడో దేశం కోణంలోంచి చూడకూడదు" అని ఆయన అన్నారు. ఉగ్రవాదం, న్యాయమైన వాణిజ్యం వంటి ప్రాంతీయ, ప్రపంచ సవాళ్లపై బహుళపక్ష వేదికల మీద ఉమ్మడి వైఖరిని అవలంబించాల్సిన ఆవశ్యకత ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కై కీతో కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై వారు చర్చించారు. మోదీ-జిన్‌పింగ్ మధ్య కుదిరిన ఏకాభిప్రాయానికి అనుగుణంగా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడానికి చైనా సిద్ధంగా ఉందని కై కీ తెలిపారు. ఎస్‌సీవో సదస్సు నిర్వహణలో చైనా అధ్యక్షతకు ప్రధాని మోదీ మద్దతు తెలిపారు. అదేవిధంగా, 2026లో భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న బ్రిక్స్ సదస్సుకు హాజరుకావాల్సిందిగా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రధాని ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి జిన్‌పింగ్ ధన్యవాదాలు తెలుపుతూ, భారత్ అధ్యక్షతన జరిగే బ్రిక్స్ సదస్సుకు చైనా పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. మరోవైపు ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ కూటమి బలోపేతానికి చైనా, రష్యా కలిసికట్టుగా పనిచేస్తాయని ఆయన వెల్లడించారు. బ్రిక్స్ దేశాల సామాజిక, ఆర్థిక వికాసాన్ని అడ్డుకునేందుకు ఎవరైనా వివక్షాపూరిత ఆంక్షలను విధించినా ప్రతిఘటిస్తామన్నారు. ఇలాంటి అంశాలలో అంతర్జాతీయ సమాజంలోని ఏ దేశానికైనా తమ మద్దతు ఉంటుందని పుతిన్ స్పష్టం చేశారు. బ్రిక్స్ కూటమిని అంతర్జాతీయ సమాజంలో బలమైన స్తంభంగా మార్చేందుకు చైనా, రష్యా కలిసి పనిచేస్తాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ లాంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో సంస్కరణలకూ బ్రిక్స్ మద్దతుగా నిలుస్తుంది. ఈ సంస్థల్లో వాస్తవిక సమానత్వం, అన్ని దేశాలకూ సమాన లబ్ధి అనే సూత్రాల ప్రాతిపదికన నూతన ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి మేం పిలుపునిస్తున్నాం. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల రుణ సాధనాలను నయా వలసవాదం కోసం కొన్ని దేశాలు వాడుకోవడం సరికాదు. ప్రపంచంలోని మెజారిటీ దేశాలకు ఆర్థిక ఫలాలు అందాలని బ్రిక్స్ కోరుకుంటోంది. బ్రిక్స్ సభ్యదేశాలకు ఆర్థిక అవకాశాలను పెంచడంపై మేం ఫోకస్ చేస్తాం. వ్యూహాత్మక రంగాల్లో బ్రిక్స్ దేశాల మధ్య భాగస్వామ్యం కోసం ఉమ్మడి వేదికలను సిద్ధం చేస్తాం. బ్రిక్స్ సామర్థ్యాన్ని మరింత పెంచుతాం' అని ఇంటర్వ్యూలో పుతిన్ వెల్లడించారు. 'జీ20 కూటమిలో చైనా పోషిస్తున్న పాత్ర చాలా గొప్పది. రష్యా, చైనా భావసారూప్య దేశాలు. మా రెండు దేశాలు కలిసి జీ20 కూటమి ప్రాధాన్యతల ఎజెండాలో గ్లోబల్ సౌత్‌ను చేర్పించాం. జీ20లో ఆఫ్రికన్ యూనియన్‌ను చేర్చడాన్ని మేం స్వాగతిస్తున్నాం.

# బీఆర్ఎస్‌తో మ్యాచ్ ఫిక్సింగ్

మొదటిపేజీ తరువాయి..

పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చలు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక, వాళ్లు ఇచ్చిన నివేదిక కాదని, అది బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలసి ఇచ్చిన నివేదిక అంటూ అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మైక్ అందుకుని మాట్లాడటం మొదలుపెట్టగానే ఒక్కసారిగా బిఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పెద్దగా నవ్వులతో సభ దద్దరిల్లింది. కమిషన్ నివేదికలో ఎక్కడా కేసీఆర్, హరీష్ రావు అవినీతి గురించి లేకపోవడమే, ఆ రెండు పార్టీల మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనడానికి ఇదే నిదర్శనమన్నారు. అవినీతి గురించి ఎక్కడా నివేదికలో ప్రస్తావించలేదు, అలా చెప్పనప్పుడు కమిషన్ ఎందుకు వేశారని బిజెపి డిమాండ్ చేస్తోందన్నారు. కేవలం ఐవాష్ కోసం మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేశారని ఆరోపించారు. 1952 యాక్ట్ ప్రకారం కమిషన్ వేసినప్పుడు ఎక్కడా నిబంధలు పాటించలేదు. కేవలం కంటితుడుపు చర్యగా మాత్రమే కమిషన్ వేసినట్లుగా కనిపిస్తోంది. ఈ నివేదిక కోర్టులో నిలబడే పరిస్థితి కనిపించడంలేదు. కోర్టు క్వాష్ చేస్తుందనే భయంతోనే ఆదివారం కూడా అసెంబ్లీ పెట్టి బ్లేమ్ గేమ్ ఆడుతున్నారని బిజెపి ఎమ్మెల్యే ఆరోపించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ లు ఆడుతున్న జగన్నాటకంగా కమిషన్ నివేదిక కనిపిస్తోంది. దోషులెవరో కమిషన్ నివేదికలో ఎక్కడా ప్రస్తావించకపోవడానికి కారణాలు ప్రభుత్వం చెప్పాలి. కాళేశ్వరం కట్టడం, కూలడం వెనుక మొత్తం కేసీఆర్ చేసిందేనని జగమెరిగిన సత్యం. కాళేశ్వరం నా మానస పుత్రిక అని చెప్పుకున్న కేసీఆర్, కమిషన్ ముందుకొచ్చినప్పుడు మాత్రం మాటమార్చారని విమర్శించారు. కరెప్షన్ ప్రాక్టీసెస్ మీద ఎంక్వైరీ చేయమని ఎక్కడా కమిషన్ కు ఎందుకు చెప్పలేదు. కేసీఆర్ అవినీతి పై పూర్తి ఆధారాలు నావద్ద ఉన్నాయని ఇన్నాళ్లు చెప్పిన రేవంత్ రెడ్డి, ఆ ఆధారాలు కమిషన్ కు ఎందుకు ఇవ్వడంలేదు. కమిషన్ కు పూర్తి స్థాయి అధికారాలు ఎందుకు ఇవ్వడంలేదో సభముందు చెప్పాలని' డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవినీతికి పాల్పడిన బిఆర్ఎస్ నేతలను జైలుకు పంపుతామన్నారు, కానీ 21 నెలలు గడిచినా నేటికీ ఏ ఒక్కరినీ జైలుకు ఎందుకు పంపలేదో చెప్పాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ముహుర్తాల కోసం చూస్తున్నారా, లేక ముడుపుల కోసం చూస్తున్నారో చెప్పాలి. కనీసం ఒక్కరిపై కూడా ఎందుకు కేసు పెట్టలేదు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్ ను అరెస్ట్ చేయబోమని ఇటీవల రేవంత్ రెడ్డి చెప్పడం వెనుక ఆంతర్యమేంటో చెప్పాలని కోరారు.

# కమిషన్ ఏం చేసింది..? నివేదికతో ఏం జరిగింది?

మొదటిపేజీ తరువాయి..

కొనసాగించాలనుకుంటున్నారా.. రిపేర్ చేస్తారా.. ఏం చేయాలనుకుంటుందో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలంటూ సర్కార్ కోర్టులోకి బాల్ నెట్టారు అక్బరుద్దీన్. కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ సభలో పెట్టాం, ఏం చర్యలు తీసుకుందాం, దీనిపై ఎలా ముందుకుపోదామని మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి సభ్యులను అడుగుతున్నారు. ఈ చర్చ ఈరోజు ముగుస్తుందా, రేపు కూడా జరుగుతుందా అనేది ప్రభుత్వానికి కూడా తెలియదంటూ ఎద్దేవా చేశారు. రష్యా, ఉక్రెయిన్ లాంటి ఏదైనా దేశంలో ఏమైనా అవినీతి జరిగితే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పరిపాలన చేయాలని 20 నెలల కిందట తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారు. కానీ చర్యలు తీసుకోవడానికి ప్రతిపక్షాలకు రాష్ట్ర ప్రభుత్వం అధికారం ఇస్తోంది. తమపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎలాగూ కోరదు. నేను ఓ మాట అంటా, ఇంకో సభ్యుడు మరో సలహా ఇస్తాడు. బీఆర్ఎస్ పార్టీని రిజెక్ట్ చేసి ప్రజలు కాంగ్రెస్‌కు ఛాన్స్ ఇచ్చారు. కానీ మీరు అధికారం దుర్వినియోగం చేస్తున్నారు. ఏదైనా తప్పు జరిగితే చర్యలు తీసుకోవడానికి బదులుగా ఏం చేయమంటారని ఇతర పార్టీల సభ్యులను ప్రభుత్వం అడగటం సరికాదు. ప్రతిపక్షాలు నిర్ణయం తీసుకోవాలని మా మీద వేస్తున్నారు. మీరు చర్యలు తీసుకునే దమ్ము, ధైర్యం లేకపోతే మీకు అధికారం ఎందుకు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సరిగ్గా నిర్వహించలేకపోతున్నారు' అని అక్బరుద్దీన్ ఒవైసీ తెలంగాణ ప్రభుత్వంపై మండిపడ్డారు. అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన తీవ్ర వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. కాళేశ్వరం రిపోర్ట్ సభలో పెట్టి చర్చించాం. దీనిపై సభ్యుల అభిప్రాయాన్ని మాత్రమే ప్రభుత్వం కోరిందని, నిర్ణయం తీసుకునే అధికారం ఇచ్చామని అక్బరుద్దీన్ ఒవైసీ చెప్పడం సరికాదన్నారు. రాజకీయాల్లో కక్ష సాధింపు ధోరణితో కాకుండా పీసీ ఘోష్ కమిషన్‌పై పారదర్శకంగా, ప్రజాస్వామ్య బద్ధంగా సభలో చర్చించి నిర్ణయం తీసుకోవాలి అనేది మా అభిప్రాయం అన్నారు. '5 ఏళ్ల రాష్ట్ర బాధ్యతల్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అప్పగించారు. పరిపాలన బాధ్యతలతో పాటు ఏదైనా తప్పు జరిగితే చర్యలు, నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని కలిగి ఉన్నారు. ఈ విషయంలో మా అభిప్రాయాన్ని అడుగుతారు ఇది మంచిదే. కానీ ప్రతి జీవో విషయంలో, ప్రతి నిర్ణయం విషయంలో ప్రతిపక్షాలను అడిగి నిర్ణయం తీసుకున్నారా అని అక్బరుద్దీన్ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో తప్పు జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లు, సంబందిత అధికారులు, నేతలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్లు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చారు. కమ్యూనిస్టు పార్టీలు, ఎంఐఎం పార్టీలకు మాత్రమే ఎలక్టోరల్ బాండ్లు రాలేదన్నారు.

### అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల

# వాకౌట్



మొదటిపేజీ తరువాయి..

ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. కాళేశ్వరం నివేదికపై చర్చ జరుగుతున్న సమయంలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని బీఆర్ఎస్ సభ్యులు ఆరోపించారు. స్పీకర్ మైక్ ఇవ్వకపోవడంతో గంటన్నర పాటు వేచి చూశామని, అయినా అవకాశం రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కొందరు సభ్యులు ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులను చించివేసి నిరసన తెలిపారు. సభ లాబీల్లో భారీ సంఖ్యలో మార్షల్స్‌ను మోహరించడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ప్రతిపక్ష



నేత ఛాంబర్‌లో సమావేశమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ తీరును నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. సభ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా వారు తమ నిరసనను కొనసాగించారు. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. సభలో కాగితాలు చించివేయడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. కాళేశ్వరం నివేదికలోని వాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకునేందుకే బీఆర్ఎస్ ఇలా ప్రవర్తిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులు సభా నియమాలను గౌరవించాలని ఆయన సూచించారు. తెలంగాణకు జీవ ప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్ర.. కక్షపూరిత.. నిరాధార ఆరోపణలు నిరూపిస్తుంటే సమయం ఇవ్వకుండా బీఆర్ఎస్ పార్టీ గొంతు నొక్కుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి కుట్రపై నిరసన వ్యక్తం చేస్తూ అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద పీసీ ఘోష్ రిపోర్టును చెత్తబుట్టలో వేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కీలక ప్రసంగం చేశారు. 'శాసనసభలో మా పార్టీ గొంతు ప్రజాస్వామికంగా నొక్కారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా కాళేశ్వరాన్ని కాపాడుకుంటాం. కాంగ్రెస్, బీజేపీ కలిసి కాళేశ్వరాన్ని శాశ్వతంగా మూసేసే ప్రయత్నం చేస్తున్నాయి. తెలంగాణ రైతుల వరప్రదాయినీ కాళేరాన్ని కాపాడుకోవడానికి అవసరమైతే ప్రజా ఉద్యమం చేస్తాం. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం, ఇంజనీరింగ్ మార్వెల్ కాళేశ్వరాన్ని కాపాడుకుంటాం' అని మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలపై తదుపరి కార్యాచరణ పార్టీలో చర్చించిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ గొంతును అసెంబ్లీలో నొక్కారు. స్పీకర్ ఏ మాత్రం సంబంధం లేనట్టుగా వ్యవహరించారు. హరీశ్ రావు ఒకరు మాట్లాడితే ముఖ్యమంత్రితో సహా మంత్రులంతా మాట్లాడారు. కానీ ఎన్ని రకాల కుట్రలు చేసినా ప్రజల తరపున, ప్రజలకు జరిగిన మేలును మరోసారి గుర్తుచేస్తూ అసెంబ్లీలో మాట్లాడే ప్రయత్నం చేశాం' అని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. 'కాళేశ్వరంపై జరుగుతున్న కుట్రను ప్రజల్లో ఎండగడతాం. కాళేశ్వరం ప్రాజెక్టును కూల్చి ఇబ్బంది పెట్టే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తున్నట్లుగా కనిపిస్తోంది' అని కేటీఆర్ వివరించారు.

# డ్యామ్, బ్యారేజీకి తేడా లేకుండా నిర్మాణం

### అందువల్ల వల్లే మేడిగడ్డ కుంగిపోయింది

### కాళేశ్వరం నిర్మాణంలో తీవ్ర లోపాలున్నాయి

### రూ.1.47 లక్షల కోట్లు ఖర్చు చేశారు

### అయినా లక్ష ఎకరాలకు కూడా నీరందలేదు

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోపణలు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో డ్యామ్‌కు, బ్యారేజీకి మధ్య తేడా పాటించకుండా ఘోరమైన తప్పిదాలకు పాల్పడ్డారని, దాని పర్యవసానమే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి కారణమని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన ఈ సంచలన విషయాలను వెల్లడించారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికలోని అంశాలను ఆయన ప్రస్తావించారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాల వల్ల మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు గత 20 నెలలుగా పూర్తిగా నిరుపయోగంగా మారాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ఖజానాపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడినప్పుడు రూ.87,449 కోట్లతో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం, చివరికి రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని విమర్శించారు. ఇంత భారీగా ఖర్చు చేసినప్పటికీ, కనీసం లక్ష ఎకరాలకు కూడా సాగునీరు అందించలేకపోయారని ఆయన అన్నారు. వాస్తవానికి, వ్యాప్కోస్ నిపుణుల సూచన మేరకు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కేవలం రూ.38 వేల కోట్లతో పూర్తిచేసే అవకాశం ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం దాన్ని పక్కనపెట్టిందని ఉత్తమ్ గుర్తుచేశారు. 2019 నుంచి 2023 మధ్య కాలంలో కాళేశ్వరం నుంచి కేవలం 162 టీఎంసీల నీటిని మాత్రమే లిఫ్ట్ చేశారని, అంటే సగటున



ఏడాదికి 20.2 టీఎంసీలు మాత్రమే వినియోగించారని గణాంకాలతో సహా వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం ఒక పెను విపత్తు అని మంత్రి అభివర్ణించారు. ఈ దుస్థితికి కారణమైన బీఆర్ఎస్ పార్టీ, ఇప్పుడు ఎన్‌డీఎస్‌ఏ నివేదికను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గతంలో ఇదే బిల్లుకు ఆ పార్టీ మద్దతు తెలిపిందన్న విషయాన్ని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు.

## బీఎస్ఎన్ఎల్ ట్యాక్సీ స్టాండ్ యూనియన్ అధ్యక్షుడుగా రెడ్డబోయిన ప్రశాంత్



కోదాడ ఆగస్టు 31 (సాక్ష్యం) కోదాడ పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ టాక్స్ స్టాండ్ యూనియన్ అధ్యక్షుడిగా రెడ్డబోయిన ప్రశాంత్ గెలుపొందారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికలలో మొత్తం పోలింగ్ అయిన ఓట్లు 151 కాగా ప్రత్యర్థి పై 21 ఓట్ల మెజారిటీతో ప్రశాంత్ గెలుపొందారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రతి సభ్యుడికి రుణపడి ఉంటానని అన్నారు. యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం అధ్యక్షుడిగా గెలుపొందిన ప్రశాంత్ కు కు యూనియన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి. కోలేటి నాగేశ్వరరావు. ఉపసర్పంచ్ కుక్కల వీరబాబు. ఆవుల శీను. ఎండి అల్తాఫ్. వాసు. రమేష్. డ్రైవర్లు సభ్యులు పాల్గొన్నారు.

## 31 వ వార్డు శ్రీనివాస్ నగర్ 11వ వార్డు కొమరబండలో అన్నదానాలు





కోదాడ ఆగస్టు 31 (సాక్ష్యం) శ్రీనివాసనగర్ కమిటీ ఆధ్వర్యంలో 31 వ వార్డులో ఆదివారం అన్నదానం నిర్వహించారు. పైడిమర్రి సత్తిబాబు, ముత్తవరపు పాండురంగారావు ఎర్రని వెంకటరత్నం బాబు, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తిపిరిశెట్టి సుశీల రాజు, సుధాకర్ అశోక్ చల్లా శ్రీనివాస్ బ్రహ్మం భాస్కర్ సూరి రవికుమార్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గౌడ్స్ యూత్ ఆధ్వర్యంలో కోమరబండలో గౌడ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భారీగా ప్రజలు హాజరయ్యారు. మాజీ సర్పంచ్ సంపెట రవి గౌడ్, కోసూరినరేష్ గౌడ్, కోటేశ్వరరావు, నరేష్, నవీన్, నాగేశ్వరరావు, సంపెట వీరస్వామి, సురేందర్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## గోపిరెడ్డి నగర్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం





కోదాడ ఆగస్టు 31 : అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని గోపిరెడ్డి నగర్ వినాయక ఉత్సవ కమిటీ నాయకులు అన్నారు పట్టణంలోని స్థానిక గోపిరెడ్డి నగర్ లో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద వినాయక కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు ముఖ్య అతిథులుగా కోదాడ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, ఎర్రవరం బాల ఉగ్ర నరసింహ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ నల్లజాల జగన్నాథం, మాజీ వార్డ్ కౌన్సిలర్ కోలా లక్ష్మీ ప్రసన్న కోటిరెడ్డి, పాల్గొని దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కమిటీ అధ్యక్షులు రెడ్డి మల్ల వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు రావెళ్ళ కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బాదిషా రామారావు కమిటీ సభ్యులు ఎర్రసాని మహేష్ రెడ్డి, పెదిరెడ్డి రవీందర్ రెడ్డి, అంబురి వెంకటరెడ్డి, వాచేపల్లి వెంకటేశ్వరరెడ్డి ,గడ్డం వెంకటరెడ్డి, గాయం బ్రహ్మానందరెడ్డి ,పింగళి వెంకటేశ్వర్ రెడ్డి, ఎర్రసాని వెంకటరెడ్డి పరిపూర్ణచారి, ,మహిళా భక్తులు, భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

– అన్నదాన కార్యక్రమం ఏర్పాటు



చిట్యాల ఆగస్ట్ 31(సాక్ష్యం) చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో రాయల్ కింగ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి వద్ద ఆదివారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ పల్లపు బుద్ధుడు భార్గవి దంపతులు ఈ కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ డైరెక్టర్ కోనేటి యాదగిరి,మాజీ ఎంపిటిసి పోలగొని స్వామి,పట్ల జనార్ధన్, జనాపాల శ్రీను,కురుపాటి లింగయ్య,బోడ శ్రీను,పాకాల దినేష్, మర్రి రమేష్, రూపనీ ఎల్లయ్య, మెడబోయిన శ్రీను,బోయ లక్ష్మయ్య, కుమార్,మర్రి యాదయ్య, జనపాల కుమార్, పల్లపు రామకృష్ణ,పల్లపు వెంకటేష్, పల్లపు శివ,పల్లపు రాకేష్,పల్లపు సాయి,యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష దీపోత్సవ కార్యక్రమం



కోదాడ ఆగస్టు 31 (సాక్ష్యం కోదాడ పట్టణంలోని శ్రీనివాస నగర్ 30 వార్డులో శ్రీరామ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవంలో భాగంగా గణేష్ విగ్రహం వద్ద లక్ష దీపోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి ఫౌండేషన్ స్కూల్ యాజమాన్యం పద్మలత శ్రీనివాస్ రావు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలను వెలిగించారు. అనంతరం గణేష్ విగ్రహం వద్ద సట్టు సీతారాములు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## డీసీపీకి వెంకటేశ్వర్ల స్వామి జ్ఞాపకను అందిస్తున్న మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్

– గుండ్లగడ్డలో గణేష్ నవరాత్రులు



జనగామ జిల్లా బ్యూరో సాక్ష్యం న్యూస్: ఆగస్టు 31 జనగామ జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డలో గణేష్ నవరాత్రులు గత 45 సంవత్సరాలుగా భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో పాల్గొన్న పిల్లలకు బహుమతులు పంపిణీ చేసే ప్రధాన కార్యక్రమానికి జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ గారు విచ్చేశారు. డిసిపిరాజమహేంద్ర నాయక్ గారిని గుండ్లగడ్డ మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్ గారు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలోధర్మపురి శ్రీనివాస్, శ్రీకాంత్, వినయ్, పవన్, రాజు, బాల ఆదిత్య, శ్రీ ఆదిత్య విగ్నేష్ పటేల్, చారి. భక్తులు, కమిటీ సభ్యులు, స్థానికులు, డీసీపీ గారికి వెంకటేశ్వర్ల స్వామి జ్ఞాపక నీ అందజేయడం జరిగింది.

## ఘనంగా యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ డే 2025






సికింద్రాబాద్, ఆగస్టు 31 (సాక్ష్యం)... ఓయూ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యుసిఇ) గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా జరుపుకుంది. సివిల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి విశ్వ విద్యాలయ ఉప కులపతి గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ను ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు గజమాలతో ఘనంగా సత్కరించారు. గ్రాడ్యుయేషన్ డె 2025 లోఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 25 బంగారు పతకాలు, 15 నగదు అవార్డులు, 25 ర్యాంక్ సర్టిఫికెట్లు అందజేశారు. గ్రాడ్యుయేషన్ ఉత్సవానికి 510 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల విశిష్ట పూర్వ విద్యార్థుల అవార్డు -2025 ను సిఇఒ అండ్ ఎండి, మోస్చిప్ టెక్నాలజీస్ లిమిటెడ్.. శ్రీనివాసరావు కాకుమాను కు అందజేశారు. ఇంజనీరింగ్ కళాశాల నుంచి వైస్-ఛాన్సలర్ గా ఎదిగిన ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ఉద్యోగ ప్రయాణం ఆదర్శనీయమని వక్తలు అభిప్రాయపడ్డారు. అతను చెప్పట్టిన అనేక ఉన్నత పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు. సైటేషన్ ఆఫ్ హానర్ తొ సత్కరించింది. అనంతరం ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులను ఉద్దేశించి ప్రొఫెసర్ కుమార్ మాట్లాడుతూ... నిరంతర అధ్యయనం, పరిశోధన, విలువలతో కూడిన జీవనం, సమగ్రత, ఐక్యత, ముందు చూపు తో పనిచేయాలని సూచించారు. సమాజంలోని సమస్యల పరిష్కారం దిశగా పనిచేయాలని కోరారు. హార్డ్ వర్క్ తో పాటు స్మార్ట్ వర్క్ ద్వారానే సులభంగా గమ్యాన్ని చేరొచ్చని అన్నారు. మంచి జీవితానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రాక్టీస్ చేయాలని సూచించారు. ఓయూ ఇంజనీరింగ్ కళాశాల అనుబంధ ఆచార్యుడిగా టి. కె కృష్ణ ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా ప్రారంభించిన భీమా హాస్టల్ త్వరలో విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. గంగ హాస్టల్ స్థానం లో మరో హాస్టల్ అందుబాటులోకి తీసుకొస్తా మని అన్నారు. ఓయూ పూర్వ విద్యార్థి యుఎస్ఎలోని కృష్ణ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ వ్యవస్థాపకుడు టి. కె కృష్ణ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు, ర్యాంక్ హోల్డర్లు, బంగారు పతక విజేతలందరినీ అభినందించారు. తల్లిదండ్రులు, గురువులు, చదివిన కళాశాల ప్రేమను గుర్తుంచుకోవాలని సలహా ఇచ్చారు. మోస్చిప్ టెక్నాలజీస్ లిమిటెడ్ సిఇఒ అండ్ ఎండి, విశిష్ట పూర్వ విద్యార్థిశ్రీనివాస రావు కాకుమాను అవుట్గోయింగ్ విద్యార్థులు, ర్యాంక్ హోల్డర్లు మరియు బంగారు పతక విజేతలందరినీ అభినందించారు. 2025 గ్రాడ్యుయేషన్ డేకి యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఓయూ చేత ఆహ్వానించబడటం చాలా సంతోషంగా ఉందని ఆయన సమావేశంలో ప్రసంగించారు. వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చంద్ర శేఖర్, అతని బృందం కళాశాల అభివృద్ధి కోసం కష్టపడుతున్నారని అభినందించారు. విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డు అందుకోవటం మరిచిపోలేనని సంతోషం వ్యక్తం చేశారు. మోస్చిప్ నుండి సి ఎస్ ఆర్ చొరవ ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం ఎనిమిది విభాగాల టాపర్స్ కు 15000/- నగదు అవార్డును ప్రకటించాడు. ఓయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చంద్ర శేఖర్ అతిధులను స్వాగతించారు. కళాశాల ప్రగతిని నివేదించారు. గ్రాడ్యుయేషన్ డే వివరాలను పరీక్షల విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్. శివరామకృష్ణ వివరించారు. ఫాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్, సీనియర్ ప్రొఫెసర్ ఎ. కృష్ణయ్య, అవుట్గోయింగ్ విద్యార్థులను అభినందించారు. బంగారు పతక విజేతలను ప్రకటించారు. నగదు బహుమతులను వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. మంగు ప్రకటించారు. పరీక్షల విభాగం సంయుక్త సంచాలకులు డాక్టర్ పి. లోకేందర్ రెడ్డి అతిథులను పరిచయం చేశారు. పరీక్షల విభాగం సంయుక్త సంచాలకులు డాక్టర్ జి. శ్రవణ్య వందన సమర్పణ చేశారు.

## ఘనంగా అన్నదానాలు



కోదాడ ఆగస్టు 31( సాక్ష్యం) పట్టణంలోని షిరిడి సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. చెన్నా రామారావు,ఎం భాష, వి వెంకట్, చావా హరినాథ్, పార్థసారథి, మల్లెల లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, కట్ల లింగారావు, షేక్ నజీర్, జమ్ముల శ్రీనివాసరావు, నెల్లూరు వెంకటేశ్వరరావు, కనగల నారాయణరావు, చిట్టిబాబు, ఆలేటి రాంబాబు, గోదా అనిల్ కుమార్, ఎం నరసింహ, పాల్గొన్నారు. 14వ వార్డులో 14వ వార్డులో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం మధిర బ్రహ్మారెడ్డి ఇంటి పక్కన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పులిగండ్ల నాగేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రామలక్ష్మీపురంలో వినాయక పూజలో పాల్గొన్న రాష్ట్ర కౌలు రైతు ఉపాధ్యక్షుడు అన్నెం పాపిరెడ్డి దంపతులు



కోదాడ ఆగస్టు 31 (సాక్ష్యం) కోదాడ మండలం రామలక్ష్మి పురం గ్రామంలో రామాలయంలో ప్రతిష్టించిన వినాయక పూజలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నెంపాపిరెడ్డి దంపతులు ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నెం పాపిరెడ్డి మాట్లాడుతూ రైతులకు విఘ్నాలు లేకుండా పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. వినాయకుడి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

## ఉత్తం పద్మావతి నగర్‌లో అన్నదానం



కోదాడ ఆగస్టు 31 (సాక్ష్యం) కోదాడ ఉత్తం పద్మావతి నగర్ లో వినాయకుడి వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాత మేడారపు అశోక్ రాధికల కుమారుడు ఆదిత్య సహకారంతో అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్తం పద్మావతి నగర్ కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎడవల్లి బాల్ రెడ్డి తో కలిసి, వినాయక విగ్రహ కమిటీతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిటీ సభ్యులు సురేషు ,మంగయ్య ,పాపారావు, శ్రీను, మోతిలాల్, వెంకటేశ్వరరావు, బాబు, శ్రీను, నాగేశ్వరావు, వెంకట్ పాల్గొన్నారు.

## గుండ్లగడ్డ కిష్టబావి గణపతి ఆలయంలో మహా అన్నప్రసాదం





జనగామ జిల్లా బ్యూరో. సాక్ష్యం న్యూస్: ఆగస్టు 31 జనగామ పట్టణంలో గుండ్లగడ్డ కృష్ణభావి వద్ద ఉన్న గణపతి ఆలయం వద్దా మహా అన్నప్రసాదం. కార్యక్రమం జరిగినది.శ్రీ లక్ష్మి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో.ఆదివారం రోజు అన్న ప్రసాదం చేయడం జరిగింది. అన్నదాతలు ఉప్పుగల్ల రవీందర్ ర%శీ%జని దంపతులు, గట్టు దామోదర్ వీణ దంపతులు, నాంపల్లి శ్రీనివాస్ స్వరూప దంపతులు, ఈ కార్యక్రమంలో గణపతి కార్యకర్తలు మాట్లాడుతూ గత 38 సంవత్సరాల నుండి గణపతి నవరాత్రులు చేయడం జరుగుతున్నది. కరుణ గణపతి చాలా మహిమగల గణపయ్య కోరిన కోరికలు నెరవేర్చేవారు అని తెలిపారు. శ్రీ లక్ష్మి గణపతి ఉత్సవా కమిటీ. కార్యకర్తలు గుదినియి త్రియంబకేష్, ఆకుల నరేష్, చేల్లోజు నవీన్ కుమార్, దుబాయ్ శీను. గట్టు రమేష్, ప్రవీణ్ కుమార్, శివ కుమార్. లింగమూర్తి , సంతోష్, శంకర్ ప్రసాద్. బాబురావు, సత్తయ్య, గోగీకర్ శివాజీ , అనిల్, కట్కూరి రామకృష్ణ, మిట్టు తదితరులు పాల్గొన్నారు,

## లంబోదరుడి దర్శించుకున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి





సికింద్రాబాద్, ఆగస్టు 31 (సాక్ష్యం) మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పలు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకులను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు మండపాల వద్ద ఏర్పాటు చేసినటువంటి అన్న ప్రసాదం (అన్నదాన) కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండపం నిర్వాహకులు, కాలనీ వాసులు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

## నాచారంలో గణనాథుని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వి ఎస్‌ఎస్ ప్రభాకర్



సికింద్రాబాద్, ఆగస్టు 31 (సాక్ష్యం) ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ లోని వివిధ కాలనీ ల లో గణేష్ మండపాలు సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, డివిజన్ అధ్యకుడు కొమ్మగల్ల నవీన్, సీనియర్ నాయకులు రాజిరెడ్డి, గందమల్ల గోపి,మోర నర్సింహారెడ్డి, రమేష్, సురేందర్ స్వామి, శేఖర్ గుప్తా, వేణుగోపాల్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులవాని, కళావతి, అసోసియేషన్ సభ్యులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# ఫార్చ్యూన్ హైట్స్ గణేశ్ లడ్డూ వేలం

– 2.3 లక్షలకి లడ్డు కైవసం చేసుకున్న డి కాశీనాథ్



హైదరాబాద్, సాక్ష్యం హైదరాబాద్ ఫార్చ్యూన్ హైట్స్ మదినగూడ గణేశ్ ఉత్సవ కమిటీఆధ్వర్యంలో గణేశ్ లడ్డూ వేలాన్ని నిర్వహించారు.ఈ వేలంలో డి. కాశీనాథ్ సౌత్ సెంట్రల్ రైల్వే సభ్యుడు 2లక్షల 30 వేలకి గెలుచుకున్నారు,ఇది ఈ సంవత్సరం గణేశ్ ఉత్సవ వేడుకల్లో ఒక ముఖ్యమైన హైలైట్‌గా నిలిచిందనీ అన్నారు.అధ్యక్షుడు హరిశంకర్ గౌడ్, కార్యదర్శి హరీష్ యొక్క డైనమిక్ నాయకత్వంలో గొప్ప భక్తితో మరియు ఉత్సాహంతో నిర్వహించబడింది. వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఘన విజయం చేసిన భక్తులకు తమ కృతజ్ఞతలు తెలియజేస్తూ.వేలం ద్వారా సమకూరిన నిధులు కమిటీ యొక్క సాంస్కృతిక మరియు మతపరమైన కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు వినియోగించబడతాయనీ అధ్యక్షుడు హరి శంకర్ గౌడ్ తెలిపారు.

# మహాధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలి

– పీఆర్టీయు మరిపెడ మండల అధ్యక్షుడు కీసర రమేష్ రెడ్డి



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 (సాక్ష్యం న్యూస్) సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ పీఆర్టీ యూటీఎస్ రాష్ట్ర సంఘ పక్షాన నిర్వహిస్తున్న మహాధర్నకు మండలం నుండి ఉద్యోగ,ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పి ఆర్ టి మరిపెడ మండల అధ్యక్షులు కీసర రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.రమేష్ రెడ్డి మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికి వర్తింప చేయాలని పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో పలుమార్లు ప్రభుత్వం, ఉన్నత విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ ను రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాల్లో వెలుగులు నింపాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తిచేశామని అన్నారు. సీపీఎస్ అంతం పీఆర్టీయూటీఎస్ పంతం అనే నినాదంతో 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియామకమైన ఉద్యోగ,ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానంను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని చలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహాధర్నాకు మరిపెడ మండలం నుండి ఉపాధ్యాయులను అధిక సంఖ్యలో తరలించడానికి మరిపెడ మండల శాఖ పక్షాన బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రేపు ఉదయం 6:30 గంటలకు స్థానిక మరిపెడ మండల విద్యా వనరుల కేంద్రం నుండి బస్సు ప్రారంభమవుతుందని తెలియజేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి వరంగల్ నల్గొండ ఖమ్మం ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి,ఏ.ఐ.యఫ్.టి.ఓ సెక్రెటరీ జనరల్ సి.యల్,రోజ్ విచ్చేస్తున్నారని అన్నారు.ఈ సమావేశంలో పిఆర్టీయు బాధ్యులు దోమల లింగయ్య, రాంమోహన్,సునీల్ కుమార్,దత్త ప్రసాద్,యాకయ్య ,గండి కరుణాకర్,గుర్రం వెంకన్న, వేముల శ్రీను,వేల్పుల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ

# మరిపెడ మున్సిపాలిటీ కేంద్రములో బీజేపీ నిరసన రాష్ట్ర నాయకుడు గాదె రాంబాబు



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 (సాక్ష్యం న్యూస్) బీహార్ యాత్రలో ప్రధాని నరేంద్ర మోడీ మాతృమూర్తి పై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ లో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఎదురుగా మరిపెడ మండల బిజెపి మండల అధ్యక్షులు కట్టోజు గంగాధర్ ఆద్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ మాతృమూర్తి పై రాహుల్ గాందీ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.రాహుల్ గాంధీ వరుస ఓటమిలతో తీవ్ర ఫ్రస్టేషన్ లో ఉండి పరుష పదజాలాన్ని వాడుతూ సంస్కార హీనంగా ప్రవర్తిస్తున్నాడని తెలిపారు.ఓటు ఛోరీ అంటూ బీహార్ లో చేపట్టిన యాత్ర కు ప్రజల నుంచి ఏలాంటి స్పందన లేకపోవడంతో ప్రధాని నరేంద్ర మోడీ పై వ్యక్తిగత జీవితం పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని, అది అతని అపరిపక్వకు నిదర్శనం అని,రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కి అధికారం కలగానే మిగిలిపోతుంది అని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూక్యా మంగమ్ టౌన్ అధ్యక్షురాలు, భూక్యా కాంతమ్మ, పాల్వాయి భాస్కర్, భూక్యా లింగం, జే.సురేష్, బి సాయి కుమార్,బి రమేష్, టీ సతీష్, ఏ రమేష్, బీ నాగరాజు, జే నాగరాజు, శ్రీనివాస్ ఏ సురేందర్, మరిపెడ మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## యాదవులు కురుమ సామాజిక వర్గానికి

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి

– టీపీసీసీ ఓబీసీ విభాగం వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్న యాదవ్



ఆగస్టు31సాక్ష్యం న్యూస్ దంతాలపల్లి ప్రతినిధి యాదవులు రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాలలో ఎదగాలని టిపిసిసి ఓబీసీ విభాగం వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్న యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యాదవ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 05న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే గొల్ల కురుమ సదస్సు పోస్టర్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో అత్యధికమైన యాదవులు కురుమ సామాజిక వర్గానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉండటం హర్షనీయమన్నారు. గొల్ల కురుమ యాదవుల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని తెలిపారు.పేద యాదవులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని,ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు సెప్టెంబర్ 05న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని యశోద గార్డెన్ లో జరిగే గొల్ల కురుమ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కంచ ఐలయ్య,ప్రభుత్వ చీఫ్ బీర్ల ఐలయ్య,మహబూబాబాద్, డోర్నకల్,పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేలు మురళి నాయక్,జాటోతు రామచంద్రనాయక్,మామిడాల యశస్విని రెడ్డిలు,పాల్గొంటన్నారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దంతాలపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎర్రబోయిన మురళి యాదవ్, బోల్లు వీరన్న యాదవ్,బెల్లి సంపత్ యాదవ్,చిన్నాల కట్టయ్య యాదవ్,కొండ సాయి యాదవ్,పయ్యాల ప్రవీణ్ యాదవ్,తండ విరేష్ యాదవ్,మరిశివ యాదవ్,గజ్జి సురేష్ యాదవ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ టెంపుల్‌లో గణనాథుని

# దర్శించుకున్న బిజెపి అధ్యక్షులు రామచందర్ రావు



సికింద్రాబాద్, ఆగస్టు 31(సాక్ష్యం) తార్నాక చౌరస్తాలోని గణేష్ టెంపుల్ లో శ్రీ లక్ష్మీ గణపతి లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాధుని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి పి. సుబ్బారావు ఆధ్వర్యంలో వందలాదిమంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ గణపతి లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్, ఉపాధ్యక్షులు కొండల్ రెడ్డి, కోశాధికారి కృష్ణారెడ్డి తోపాటు పలువురు పాల్గొన్నారు.

## లాలాపేట్ మున్నూరు కాపు సంఘం

# గణనాదుడిని నిమజ్జనానికి తరలింపు

సికింద్రాబాద్, ఆగస్టు 31 (సాక్ష్యం) లాలాపేట్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాదుడిని ఆదివారం



ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం లాలాపేట్ అధ్యక్షుడు చిలుక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మీసాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మాడ ప్రమోద్, గర్వమోహన్, చింతల కృష్ణ స్వామి, సావలి వెంకటేష్, ఆకుల లక్ష్మినారాయణ, చెలిమెల రాజు, పొట్ల చెరువు ముత్యాలు, మీసాల శ్రీనివాస్,గడ్డం చందు, లక్కాకుల రమేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రధాని నరేంద్ర మోడీ మన్‌కి


# బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన అధ్యక్షుడు రామచంద్రరావు



సికింద్రాబాద్, ఆగస్టు 31 (సాక్ష్యం) ....ప్రధాని నరేంద్ర మోదీ భారత ప్రజలను ఉద్దేశించి మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా సందేశం అందించారు.ఈ సందర్భంగా, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తార్నాక డివిజన్ బూత్ నం. 204 లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, రాష్ట్రస్థాయి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా హాజరై, ప్రధానమంత్రి ప్రసంగాన్ని వీక్షించి, ఆయన పిలుపునకు స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నాయకులు పోచయ్య యాదవ్, ఉపేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ భరత్ నగర్‌లో విశేష

# పూజలు అందుకుంటున్న జై భవాని ఫ్రెండ్స్ అసోసియేషన్ గణనాథుడు



ఉప్పల్, ఆగస్టు 31 (సాక్ష్యం).... ఉప్పల్ భరత్ నగర్ లో జై భవాని ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడు విశేష పూజలు అందుకుంటున్నారు. స్థానికులు పెద్ద ఎత్తున గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

## గణనాథుడిని దర్శించుకున్న

# కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్



సికింద్రాబాద్, ఆగస్టు 31 (సాక్ష్యం) ....వినాయక మండప నిర్వాహకులు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాధుని కార్పొరేటర్ శాంతి సాజన్ శేఖర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండప నిర్వహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి సాజన్ శేఖర్ పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. నాచారం డివిజన్ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కార్పోరేటర్ ఈ సందర్భంగా విఘ్నేశ్వరుని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి,రజని, లావణ్య, అన్నపూర్ణ,రామ, సృజనా, అశ్విని, చందన, అనిల్, తిరుమలేష్ బాబు, లక్ష్మణ్, రమేష్ నికిల్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలుకు కృషి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



జనగామ జిల్లా బ్యూరో సాక్ష్యం న్యూస్: ఆగస్టు 31 బీసీ రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా సామాజిక న్యాయం పట్ల తమ కట్టుబాటును మరోసారి రుజువు చేసినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మరియు కాంగ్రెస్ ప్రభుత్వం కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ నిర్ణయం వలన వెనుకబడిన వర్గాలకు రాజకీయ, సామాజికంగా న్యాయం జరుగుతుంది. తెలంగాణలో బీసీ వర్గాల ఆశయాలను గౌరవిస్తూ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం ఎంతోమంది యువతకు, నాయకత్వానికి అవకాశాలు కల్పిస్తుంది. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వెనుకబడిన వర్గాల కోసం పనిచేస్తూ సమానత్వం, న్యాయం సాధించే దిశగా ముందుకు సాగుతోందని ఈ నిర్ణయం మరొక్కసారి నిరూపించింది.బీసీ రిజర్వేషన్ అమలుకు కృషి చేసినందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తు కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు ఈరోజు జనగామ జిల్లా ఆఫీస్ కార్యాలయంముందు టపాకాయలు కాలుస్తూ స్వీట్ తినిపిస్తూ సంబరాలు చేయడం జరిగింది. జనగామ పట్టణ అధ్యక్షులు చెంచారాపు బుచ్చిరెడ్డి, ఆధ్వర్యంలో ఈ యొక్క కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ఈ కార్యక్రమానికి హాజరైన వారు ,ఆలేటి సిద్ధి రాములు, , బక్కశీను ,మోర్తాలప్రభాకర్,అండాలు, మైనార్టీ ప్రెసిడెంట్ ఇస్మాయిల్, నోముల రాజు వార్డ్అధ్యక్షులు, మచ్చ ప్రవీణ్, ఆరేళ్ల సిద్ధులు విజయ్, కడారు ప్రవీణ్, ఎండి కమల్, భూరెల్లిసిద్ధులు, నోమూలా సోమయ్య, ఉల్లెంగులశీను, హర్షత్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, మారబోయిన ప్రకాష్, రఘు, అరవింద, బిరు సత్యనారాయణ, ఎండి సలీం, యాదగిరి, కార్యక్రమంలో పాల్గొన్నడం జరిగింది.

## శేష పహాడ్‌లో గణనాథుని దర్శించుకున్న

# కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ



సికింద్రాబాద్, ఆగస్టు 31 (సాక్ష్యం).. లాలాగూడ శేష పహాడ్ లో ఏర్పాటుచేసిన గణనాథుడిని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో లింగాని శ్రీనివాస్, సునీల్, శ్రీనివాస్ గౌడ్, కుమార్ వంశరాజ్, శేఖర్, చంద్రశేఖర్ తోపాటు మల్లేష్, వంశీ, శ్రీనివాస్, నవీన్, చందు, పవన్, చంద్రశేఖర్, విష్ణుకుమార్ వంశరాజ్ తో పాటు పాలువురు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులను కలిసి పరామర్శ

– డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



ఆగస్టు 31 సాక్ష్యం న్యూస్ దంతాలపల్లి ప్రతినిధి దంతాలపల్లి మండల బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ధర్మారపు వేణు తండ్రి ధర్మారపు వెంకటయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్ ఆదివారము పెద్దముపారం గ్రామములో వారి స్వగృహంలో పరామర్శించి మనోధైర్యం తెలియజేసినారు. అదే విధంగా అదే గ్రామానికి చెందిన కొండ లింగమల్లు (కొమురయ్య) కి అపెండెక్స్ ఆపరేషన్ అయినందున ఆయనను కూడా వారి స్వగృహంలో పరామర్శించి మనోధైర్యం తెలిపినారు.ఈ కార్యక్రమములో వారితో పాటు నూకల వెంకటేశ్వర రెడ్డి, ఓలాద్రి మల్లారెడ్డి, నాగిరెడ్డి వెంకట్ రెడ్డి, గోడిశాల సంజీవ రావు, బండి నరసయ్య, అంకతి సతీష్, కొండ లింగమల్లు, హరీష్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## కురుమ సంఘం మండల
# అధ్యక్షుడుగా పోతురాజు కుమారస్వామి



ఖానాపురం ఆగష్టు31 (సాక్ష్యం న్యూస్ ) : ఖానాపురం మండల కురుమ సంఘం అధ్యక్షుడిగా కొత్తూరు గ్రామానికి చెందిన పోతురాజు కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డివిజన్ అధ్యక్షులు బుదిగొండ భిక్షపతి ఉపాధ్యక్షులు కోరె సుధాకర్ తెలిపారు. ఖానాపురం మండల కేంద్రంలో కురుమ కుల సంఘం సమావేశం జరిగింది, ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కురుమ సంఘం మండల అధ్యక్షులుగా పోతురాజు కుమారస్వామి గౌరవ అధ్యక్షుడిగా గోవిందు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా కుండే ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా గోవిందు మల్లయ్య, కోశాధికారిగా ఆరే సంపత్ కుమార్ ,కార్యవర్గ సభ్యులుగా పోతురాజు దేవేందర్, మల్లయ్య, అశోక్, రాములు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కోరె రాము, బండి రాజ్ కుమార్, పోతరాజు లింగయ్య,కోరె మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెంకటమ్మ చిత్రపటానికి
# శ్రద్ధాంజలి ఘటించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది



ఖానాపురం (సాక్ష్యం న్యూస్ ) : ఖానాపురం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ తాజా మాజీ సర్పంచ్ భర్త మండల నాయకులు భూష అశోక్, జాటోత్ సదర్ లాల్, శీలం బిక్షపతి, కడారి సాంబయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. అలాగే కొత్తూరు మాజీ సర్పంచ్ బోళ్ళ బిక్షపతి తల్లి వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు , ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ,మాచర్ల కొమ్మాలు ,తక్కలపల్లి బాబురావు ,రామ సాయం ఉపేందర్ రెడ్డి ,వల్లేపు శ్రీను, జాటోత్ బాలునాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు జాటోత్ రమేష్, బంధారపు శ్రీనివాస్ ఎస్కె మస్తాన్ కోరే సుధాకర్, కోరే రాము,సొంటి లక్ష్మణ్, పోతరాజు కుమారస్వామి, బొమ్మెర మునేందర్, పోతరాజు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలు సభ్యులను ఓదార్చి పరామర్శించిన
# మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు





మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 (సాక్ష్యం న్యూస్) మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రం, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన.. దుబ్బాక లక్ష్మారెడ్డి మాతృమూర్తి (దుబ్బాక వెంకటమ్మ ) మరిపెడ గ్రామానికి చెందిన (గంట్ల వెంకటరెడ్డి ) పార్థివ దేహాలను సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించిన మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు వారి వెంట అశోక్ రెడ్డి, మాజీ ఎంపీపీ గూగులోత్ వెంకన్న , పేపర్ శ్రీను, లతీఫ్, తుమ్మ సత్యం, వస్త్రం, గోల్కొండ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## యువత విగ్నేశ్వరుని
# ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి

- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- ఘనంగా వేపచెట్టు గణేష్ 50వ వార్షికోత్సవం
- ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 5000 మందికి అన్నదాన కార్యక్రమం





కల్వకుర్తి ఆగస్టు 31 (సాక్ష్యం న్యూస్): యువత విగ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని వేపచెట్టు గణేష్ ను మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విగ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం వేప చెట్టు గణేష్ 50వ వార్షికోత్సవ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు గత ఏడాది విగ్నేశ్వరుని లడ్డు దక్కించుకున్న ఎన్ఆర్ఐ కొప్పుల హర్షవర్ధన్ రెడ్డి ఆస్ట్రేలియా సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేప చెట్టు గణేష్ మండపం వద్ద 5000 మందికి అన్నదానం చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ చైర్మన్లు రాచోటి శ్రీశైలం,ఎడ్మ సత్యం,లతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులు నక్క ప్రదీప్,కిషోర్,సత్యం,సాయి, గణేష్,పవన్,రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థికసహాయం



కల్వకుర్తి, ఆగస్టు 31 (సాక్ష్యం న్యూస్):కల్వకుర్తి మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన నాప రాములమ్మ, చిక్కండ పద్మ, అనారోగ్యంతో మరణించారు. మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య ద్వారా ఈ విషయం తెలుసుకున్న మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆ కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసాని ఇచ్చారు. ఉప్పలచారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేయాలని ఉప్పల ట్రస్ట్ సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పాండుగౌడ్, మాజీ వార్డు సభ్యులు ఆంజనేయులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యాల రమేష్, ఆనంద్, నరేష్, విష్ణు,మల్లయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, యాదయ్య, ఈదమయ్యా, ఉన్నారు.

# కార్మికోద్యమ నేత ఎర్రజెండ ముద్దుబిడ్డ చామకూరి రాములు

## – సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



జనగామ జిల్లా బ్యూరో. సాక్ష్యం న్యూస్ : ఆగస్టు 31 జనగామ జిల్లాలోని అమరజీవి ఎసిరెడ్డి నరసింహారెడ్డి సూచన సలహాలతో రైస్ మిల్లు హమాలి మిల్స్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసి గత 50 సంవత్సరాలుగా అనేక కార్మిక ఉద్యమాలు నిర్మించిన దాంట్లో హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారంలో వారి వేతనాల పెంపు సౌకర్యాలు కలిగించే పోరాటాలలో చామకూరి రాములు మిల్లు వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా అధ్యక్షులుగా ఉండి ఎన్నో పోరాటాలకు సిఐటియు నాయకులుగా ఎర్రజెండా చేతబట్టి నాయకత్వం వహించిన ముద్దుబిడ్డ చామకూర రాములని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. ఆదివారం రోజున వారు అకస్మాత్తుగా గుండెపోటుకు గురై ఉదయం మరణించారు.జనగామ మండలం మరిగడలోని వారి ఇంటి వద్ద రాములు పార్థివదేహంపై ఎర్రజెండా పార్టీ పతాకాన్ని కప్పి అమరవీరుల గీతాలు ఆలాపించి ఘనంగా నివాళు లర్పించడంజరిగింది. ఈసందర్భంగా సిపిఎం జనగామ మండల కార్యదర్శి బోడ నరేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మరిగడి గ్రామం అంటేనే కమ్యూనిస్టు ఉద్యమాలకు పెట్టని కోట అని ఈ గ్రామంలో అనేక పర్యాయాలు సిపిఎం గ్రామ సర్పంచులను ఎంపీటీసీలను గెలిపించడంలో రాములు గారు కీలకపాత్ర పోషించారని అలాగే జనగామ నియోజకవర్గంలో సిపిఎం రెండు పర్యాయాలు గెలిచిన సందర్భంలో కూడా హమాలీ కార్మికులను మరిగడి చుట్టుపక్క గ్రామాల ప్రజలను సమీకరించి సిపిఎం పక్షాన నిలబెట్టడంలో కీలక భూమిక పోషించారన్నారు. మరిగడి గ్రామ ప్రజల సమస్యల పరిష్కారంలో అనునిత్యం పాలుపంచుకొని ప్రతి కుటుంబంతో విడదీయరాని బంధం వారు ఏర్పరచుకున్నారని తెలిపారు.తను పుట్టినప్పు బుద్ధి ఎరిగిన నాటినుండి తన సుదీర్ఘ జీవితంలో సిపిఎం ఎర్రజెండా తప్ప మరో జెండా పట్టలేదని గొప్ప పోరాట యోధుడు రాములు అని కొనియాడారు.నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వంకార్మికులు కొట్లాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తుందని కార్మిక సంఘాలు పెట్టుకోవడానికి వీలు లేని పద్ధతులలో చట్టాలు చేసిందని కార్మికుల నిజవేతనాలు పడిపోయాయని కార్మికుల హక్కుల కోసం కష్టజీవుల రాజ్యం కోసం ప్రజా పోరాటాలు ఉధృతంగా నడపడమే రాములు గారి ఆశయాలు సాధించే కొనసాగింపు అని సందర్భంగా వారు పార్టీ కార్యకర్తలకు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎర్రి అహల్య కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్ జిల్లా కమిటీ సభ్యులు గోపి పోత్కనూరి ఉపేందర్ సిపిఎం మరిగడి గ్రామ నాయకులు బోడ రాములు కూరాకుల శ్రీనివాస్ దండు శ్రీను బాల్నే కిష్టయ్య కాసాని సిద్దులు ఏదూల వెంకటయ్య మచ్చ నారాయణ బోడ లక్ష్మయ్య సాంబరాజు మల్లేష్ వంగ కవీణ్ కాసాని మల్లేష్ బండి చెందర్ రామావత్ బిక్కు బోడ మహేందర్ మచ్చ పాండు కాసాని నర్సింహులు బాల్నే శ్రీకాంత్ కూరాకుల సమయ్య గుగులోతు కిషన్ కూకట్ల నర్సయ్య గుగులోతు శ్రీను గుగులోతు ప్రవీణ్ బండి రాములు తదితరులు పాల్గొన్నారు.


# శారద మల్లేష్ దంపతులకు పుస్తకాన్ని అందజేసిన మాజీ గవర్నర్ దత్తాత్రేయ



సికింద్రాబాద్, ఆగస్టు 31 (సాక్ష్యం) ....హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మాజీ గవర్నర్, మాజీ కేంద్రమంత్రి, మాజీ ఎంపీ, ఉమ్మడి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా, ఆర్ఎస్ఎస్ సంఘ ప్రచారక్ గా, సేవా భారతి స్థాపకులు గా దివిసీమలో 1977 లో వచ్చిన తుఫాను లో (అనాధ శవాల) దీన బంధువుల శవాలను దహన కార్యక్రమాలు నిర్వహించిన, మామూలు కుటుంబంలో జన్మించిన బండారు దత్తాత్రేయ తాను రచించిన పుస్తకాన్ని బిజెపి సీనియర్ నాయకులు శారదా మల్లేష్ దంపతులకు అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి బిఎస్సి డిగ్రీ పూర్తిగానే (1968) వెంటనే దేశం కోసం ధర్మం కోసం, తల్లి నీ, ఇల్లును వదిలేసి సంఘ ఆర్ఎస్ఎస్ ప్రచారక్ గా జీవితం ప్రారంభించి, 12(1968 నుండి 1980 ) సంవత్సరాలగా సంఘ ప్రచారంగా 20 సంవత్సరాలు భారతీయ జనతా పార్టీలో పూర్ణ సమయం కార్యకర్తగా ఉంటూ, దీన ప్రజలకు, బీద ప్రజలకు నేనున్నానని చెబుతూ ప్రజాసేవలో నిరంతరం గడుపుతున్న బండారు దత్తాత్రేయ తన జీవిత ప్రయాణాన్ని, కష్టసుఖాలను అన్ని కూడా విడమర్చి చెబుతూ రాసిన అమూల్యమైన గ్రంథం "ప్రజల కథ నా ఆత్మకథ"మహా గ్రంథం ను ఆయన చేతుల మీదుగా నుండి అమూల్యమైన గ్రంథాన్ని శారద మల్లేష్ దంపతులు స్వీకరించారు. ఈ బుక్ లో చాలా విషయాలను పొందుపరచడం జరిగిందని, ఎంతోమంది జీవితాలకు సంబంధించి తన జీవితంలో ఎన్నో స్ఫూర్తి పొందిన,విషయాలను, పేరణ కలిగించే విషయాలు ఉన్నాయి. ఆ బుక్ ను మేం స్వీకరించడం జరిగిందని చెప్పారు. మాతోపాటు చాలామంది కూడా ఈ విషయాన్ని తెలియడం కోసం ఇంకా కొన్ని బుక్కులు తీసుకొని మేము ఇతరులకు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. గవర్నర్ నుంచి నుండి పుస్తకం తీసుకోవడం మాకు ఎంతో ఆనందం కలిగిందని శారదామల్లేష్ పేర్కొన్నారు.

# ఓ ముస్లీం కుటుంబం గణపతి ఉత్సవాలలో భాగస్వామ్యం

## – ఐదేండ్లుగా గణపతి విగ్రహం అన్నప్రసాద వితరణ చేస్తూ మత సామరస్యానికి వేదిక రాంలింగయ్యపల్లి







ఖానాపురం ఆగష్టు 31 (సాక్ష్యం న్యూస్): ఓ ముస్లీం కుటుంబం గత ఐదేళ్ళుగా గణపతి విగ్రహాన్ని నిర్వహాకులకు అందిస్తూ అన్నప్రసాద వితరణలో సైతం భాగస్వాములు అవుతూ కులమతాలకు అతీతమని నిరూపించారు. వివరాలు ఇలా ఉన్నాయి...వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట శివారు రాంలింగయ్యపల్లి వినాయక చవితి మత సామరస్యానికి వేదికగా మారింది. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా రాంలింగయ్య పల్లెకు చెందిన ఎస్ కె ఖలీల్ – సుల్తానాబేగం వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేసి స్థానిక యూత్ నిర్వహాకులకు అందించారు. అంతేగాక అదివారం జరిగిన అన్నప్రసాద వితరణలో భాగస్వామి తనవంతు ఖర్చు చేశారు. తాను దైవాన్ని నమ్మడానికి గల ఆసక్తి విషయాలు ఖలీల్ వెల్లడించారు. ఖలీల్ –సుల్తానా బేగం దాంపత్య జీవితంలో సంతానం కలుగడంలేదు. అసమయంలో హైదరాబాద్ లో మినిరల్ వాటర్ ఫ్లాంటు నిర్వహణ సాగిస్తున్నాడు. హైదరాబాద్ నగరంలో భారీ ఎత్తున జరుగుతున్న గణపతి నవరాత్రి మండపంలో ఓ రోజు వెళ్ళి నమస్కరించి తమకు సంతానం కలుగాలని అందుకు విగ్రహాన్ని నిలబెడుతానని మనస్సులో తలంచుకున్నాడు. తదుపరి కాలంలో పాప జన్మించించి.తాము నమ్మిన దైవం కణికరించిందని నమ్మకంతో 2021 నుంచి 23 వ సంవత్సరం వరకుమూడు సంవత్సరాలపాటు హైదరాబాద్ బోడుప్పల్ ప్రాంతంలోని నందిననగర్ లో వినాయక విగ్రహాన్ని నిర్వహాకులకు అందిస్తూ అన్నప్రసాద వితరణలో భాగస్వాముడయ్యాడన్నారు. తదుపరి స్వగ్రామమైన రాంలింగయ్యపల్లెకు వచ్చినప్పటికి ఇక్కడ గత రెండెళ్ళుగా వినాయక విగ్రహాన్ని ఇవ్వడం,అన్నప్రసాద వితరణలో భాగస్వాముడవుతూ వస్తున్నాడు. వారికి ఇప్పుడు పాప,బాబు సంతానం కలదు. ప్రజా స్వామ్య భారతదేశంలో సర్వమతసమ్మెళనం ,మతసామరస్యానికి నిలయం. మేము దైవాన్ని నమ్మడంతోపాటు అల్లాను ఆదరిస్తామని తెలిపారు. కొంతమంది మతపెద్దల నుంచి కూడ ఒత్తిడిలు వచ్చినట్లుగా తెలిసింది. ఐనప్పటికి కులమతాలకు అతీతమని నిరూపించి అందరి నోట శభాష్ అనిపించుకున్నారు.

## ప్రధాని మోదీ మాన్కి బాత్ ప్రసంగం
# ఆసక్తిగా విన్న రాష్ట్ర బీజేపీ నాయకులు కురువ చిన్న మల్లయ్య

- మన్కి బాత్లో ప్రధాని మోదీ ప్రసంగం 125వ ఎపిసోడ్
- బిజెపి రాష్ట్ర నాయకులు కురువ చిన్న మల్లయ్య
- చిన్నంబావి మండల అధ్యక్షులు బొగ్గ కురుమయ్య
- చిన్నంబావి మండల ఉపాధ్యక్షులు గణేష్ రెడ్డి
- చిన్నంబావి మండల ఎస్సి మోర్చ అధ్యక్షులు కత్తి



చిన్నంబావి, మండలం ఆగస్టు 31 (సాక్ష్యం న్యూస్): దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం మన్ కి బాత్ 125వ ఎపిసోడ్లో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని చిన్నంబావి మండలంలోని వెల్లటూర్ గ్రామంలో రాష్ట్ర బిజెపి నాయకుడు కురువ చిన్న మల్లయ్య తన నివాసంలో ప్రత్యేకంగా వీక్షించారు.ఈ సందర్భంగా మోదీ గారు దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు, సహజ విపత్తులు, క్రీడా రంగంలో సాధిస్తున్న విజయాలు, ప్రభుత్వ చర్యల గురించి ప్రజలకు వివరించారు. ముఖ్యంగా మాన్సూన్ సమయంలో వచ్చిన వరదలు, కొండచరియలు దేశానికి సవాలుగా మారాయని, అనేక రాష్ట్రాల్లో ఇళ్లు ధ్వంసమయ్యాయని, పంటలు నష్టపోయాయని, వంతెనలు%-%రహదారులు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో చిన్నంబావి మండల బిజెపి అధ్యక్షుడు బొగ్గ కురుమయ్య, మండల ఉపాధ్యక్షుడు గణేష్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కత్తి జానీ, నాగర్ కర్నూల్ జిల్లా జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకుడు ఎల్లారెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రసంగానంతరం నాయకులు మండల సమస్యలపై చర్చించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం మోదీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచ్ స్థానిక ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, అధిక సంఖ్యలో ప్రజాప్రతినిధులను గెలిపించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు."మనందరం ఒకే మండలానికి చెందినవారమై కలిసికట్టుగా పనిచేసి చిన్నంబావి మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి" అని నాయకులు స్పష్టం చేశారు.



# గ్రేస్ హేడెన్ అత్యంత ట్రెండింగ్ క్రికెట్ ప్రజెంటర్

ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2025లో ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం మాథ్యూ హేడెన్ కూతురు గ్రేస్ హేడెన్ తన స్టైలిష్ లుక్, అందమైన యాంకరింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గ్రేస్ హేడెన్ యాంకరింగ్ ప్రస్తుతం ఈ లీగ్‌లో ఎక్కువగా సెర్చ్ చేయబడుతున్న అంశాలలో ఒకటిగా నిలిచింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో స్టార్ స్పోర్ట్స్‌తో కామెంటరీ చేసినప్పుడే గ్రేస్ హేడెన్ క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత, ఇప్పుడు ఢిల్లీలో జరుగుతున్న ఈ అతిపెద్ద టీ20 లీగ్‌లో కూడా ఆమె తన గ్లామర్, ఫ్యాషన్‌తో అందరినీ ఆకట్టుకుంటోంది. క్రికెట్ ప్రపంచంలో తండ్రి సాధించిన విజయాలను మైదానం బయట కొనసాగిస్తున్నట్లుగా ఆమె ప్రదర్శన ఉంది. గ్రేస్ హేడెన్ వ్యక్తిగత జీవితం, ఆమె లైఫ్ స్టైల్‌పై అభిమానులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఆమె ఇటలీలో సెలవులకు వెళ్లినప్పుడు దిగిన బికినీ ఫోటోలు సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయ్యాయి. దీంతో ఆమె ఒక క్రికెట్ ప్రజెంటర్‌గా తన లైఫ్‌స్టైల్‌తో ట్రెండింగ్‌లో నిలిచింది.భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ తో ఆమె స్నేహం కూడా చర్చనీయాంశమైంది. ఇద్దరూ కలిసి కారులో తిరుగుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, వారిద్దరి మధ్య ఉన్న స్నేహం గురించి మరింత ఆసక్తి పెరిగింది.తన బాయ్‌ఫ్రెండ్ విల్సన్ స్టాథమ్‌తో కలిసి గడిపిన సెలవుల ఫోటోలు కూడా క్రికెట్ వర్గాలతో పాటు సెలబ్రిటీ మీడియాలో కూడా హాట్ టాపిక్‌గా మారాయి. ఐపీఎల్ సమయంలో గ్రేస్ హేడెన్ చూపించిన చొరవ, ఆకర్షణ వల్ల, ఆ సంవత్సరానికి ఆమె ఎక్కువగా సెర్చ్ చేయబడిన మహిళా క్రికెట్ యాంకర్లలో ఒకరిగా నిలిచిందియ ఆమె అందంతో పాటు, క్రికెట్ గేమ్ పట్ల ఆమెకున్న పట్టు, మ్యాచ్‌లను విశ్లేషించే విధానం అందరినీ ఆకట్టుకున్నాయి. గ్రేస్ హేడెన్ తన స్టైలిష్ దుస్తులతో, గ్లామరస్ ప్రెజెంటేషన్‌తో ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో ఒక కొత్త ఫ్యాషన్ ట్రెండ్‌ను సెట్ చేస్తోంది. 2025లో అత్యంత ట్రెండింగ్ క్రికెట్ ప్రజెంటర్లలో ఆమె ఒకరిగా నిలబడింది.





# పిచ్‌కు నిప్పుపెట్టిన గ్రౌండ్ స్టాఫ్

క్రికెట్ మ్యాచ్‌కు వర్షం ఆడ్డంకి కలిగించడం సహజమే. దీంతో మైదానంలోని పిచ్ తడవకుండా కవర్లు కప్పుతారు. అలా పిచ్‌ను కాపాడుతారు. వర్షం తర్వాత పిచ్‌పై రోలన్‌ను అటూ, ఇటూ తిప్పుతూ పిచ్‌ను ఎండబెడతారు. కానీ వర్షం తర్వాత మైదానం ఎండబెట్టడానికి ఓ మ్యాచ్‌లో తీసుకున్న ఒక వింత నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నమీబియా- స్కాట్లాండ్ మధ్య జరిగిన %×జజ% వరల్డ్‌కప్ లీగ్ 2 మ్యాచ్‌లో గ్రౌండ్ స్టాఫ్ పిచ్‌పై మంటలు పెట్టారు. ఈ ఘటన ఫొటోలు బయటకొచ్చాయి. ఇవి సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో క్రికెట్‌లో లో హాట్ టాపిక్ గా మారింది.కెనడాలోని ఆంటారియో మ్యాపిల్ లీఫ్ నార్త్ వెస్ట్ గ్రౌండ్‌లో ఆగస్ట్ 29న వర్షం పడింది. ఉదయం నుంచే ఆట మొదలు కాలేదు. మధ్యలో పలు సార్లు పిచ్ ఇన్‌స్పెక్షన్‌లు చేసినా పరిస్థితి మెరుగుపడలేదు. సాయంత్రం మరోసారి పరిశీలనకు సిద్ధమవుతున్నప్పుడే గ్రౌండ్ స్టాఫ్ ఒక విచిత్రమైన పద్ధతి ఎంచుకున్నారు. పిచ్‌పై నిప్పు పెట్టి దాన్ని ఎండబెట్టాలని చూశారు. ఫొటోలు బయటకు రావడంతో అభిమానులు ఆశ్చర్యపోయారు. ఇది ఆధునిక క్రికెట్‌లో చాలా అరుదుగా జరిగే విషయం. అయినప్పటికీ పిచ్ పూర్తిగా ఆడే స్థితికి రాకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది.నమీబియా- స్కాట్లాండ్ పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఇప్పటివరకు 21 మ్యాచ్‌ల్లో 11 విజయాలతో స్కాట్లాండ్ 3వ స్థానంలో ఉంది. మరోవైపు 22 మ్యాచ్‌లు ఆడిన నమీబియా కేవలం 8 గెలిచి 6వ స్థానంలో నిలిచింది. అమెరికా జట్టు 20 మ్యాచ్‌ల్లో 14 విజయాలతో అగ్రస్థానంలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి మ్యాచ్ ఫలితం జట్ల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంది. కాబట్టి మ్యాచ్ రద్దు కావడం ఇరుజట్లకూ తలనొప్పిగా మారింది.ఈ మ్యాచ్‌కు ముందు నమీబియా, కెనడాపై ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కానీ స్కాట్లాండ్ మాత్రం నెదర్లాండ్స్ చేతిలో ఓడిపోయింది. 369 పరుగులు చేసినా, డచ్ జట్టు నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేధించింది. ఈ ఫలితాల తర్వాత స్కాట్లాండ్ పాయింట్ల పట్టికలో నిలబడేందుకు ఇబ్బంది పడుతోంది. మరోవైపు నమీబియాకు క్వాలిఫికేషన్ రేసు మరింత కఠినమవుతోంది.ఇప్పుడు ఇరుజట్లు తమ తదుపరి మ్యాచ్‌లలో కెనడాను ఎదుర్కోబోతున్నాయి. ఆగస్ట్ 31న స్కాట్లాండ్, సెప్టెంబర్ 2న నమీబియా కెనడాతో తలపడతాయి. ముఖ్యంగా నమీబియా 2027 వరల్డ్‌కప్ సహ ఆతిథ్య దేశం అయినప్పటికీ ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ లేదు. కాబట్టి ఈ లీగ్‌లో సాధించే ప్రతి విజయమే భవిష్యత్తుకు కీలకం అవుతుంది. నమీబియా 2003 తర్వాత మళ్లీ వరల్డ్‌కప్ ఆడాలని కలలు కంటోంది. స్కాట్లాండ్ మాత్రం 2015 తర్వాత ఆ టోర్నమెంట్‌లోకి ప్రవేశించలేదు. ఈసారి లీగ్ 2లో బలమైన ప్రదర్శన ఇవ్వకపోతే మళ్లీ ఆ కలలు నెరవేరవు.

# సమీర్ రిజ్వీ ఊచకోత..

యూపీ ప్రీమియర్ లీగ్ 2025లో సమీర్ రిజ్వీ బ్యాట్ గర్జిస్తోంది. ఈ లీగ్‌లో కాన్పూర్ సూపర్‌స్టార్స్ జట్టుకు నాయకత్వం వహిస్తున్న సమీర్ మరోసారి సిక్స్‌లు, ఫోర్లు బాదాడు. ఈరోజు లక్నో ఫాల్కన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సమీర్ రిజ్వీ కేవలం 32 బంతుల్లో అజేయంగా 76 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల విజయాన్ని అందించాడు. 163 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన కాన్పూర్ జట్టు సమీర్ మెరుపు బ్యాటింగ్ కారణంగా కేవలం 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది.బ్యాటింగ్‌కు దిగిన సమీర్ రిజ్వీ ఆటను చాలా స్లోగా ప్రారంభించాడు. ఆ విధంగా మొదటి 15 బంతుల్లో కేవలం 12 పరుగులు మాత్రమే చేశాడు. కానీ, ఆ తర్వాత లక్నో బౌలర్లపై దాడి చేయడం ప్రారంభించిన సమీర్ రిజ్వీ తరువాతి 17 బంతుల్లో 9 సిక్సర్లు బాదాడు. గొప్ప విషయం ఏమిటంటే చివరి 11 బంతుల్లో 7 సిక్సర్లు, 2 ఫోర్లు బాదాడు. సమీర్ రిజ్వీ చివరి వరకు నాటౌట్‌గా నిలిచాడు. తన జట్టుకు విజయం అందించిన తర్వాతే తిరిగి వచ్చాడు.

# సెమీస్‌లో ఓడిన సాత్విక్-చిరాగ్

## ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్

ఫ్రాన్స్ లో జరుగుతున్న బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్ షిప్ 2025లో భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టికి నిరాశ ఎదురైంది. సెమీఫైనల్ మ్యాచ్‌లో ఈ భారత జోడీ చైనాకు చెందిన చెన్ బో యాంగ్, లియూ యీ జోడీ చేతిలో ఓడిపోయింది. దీంతో ఫైనల్ కు ప్రవేశించే అవకాశం కోల్పోయి కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మ్యాచ్ మొదటి రెండు గేమ్స్ లో భారత జోడీ అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. తొలి గేమ్ లో సాత్విక్-చిరాగ్ 9-3 ఆధిక్యాన్ని సాధించారు. అయితే ఆ తర్వాత చైనా జోడీ పుంజుకుని 21-19తో తొలి గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లో భారత జోడీ మళ్లీ తమ పట్టు నిలుపుకుని 21-18తో గెలిచి మ్యాచ్‌ను సమంచేసింది. మూడో, చివరి గేమ్‌లో చైనా జోడీ మరోసారి తమ ఆటను మెరుగుపరుచుకుని 21-12తో భారత జంటను ఓడించి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఈ ఓటమితో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ చరిత్ర సృష్టించే అవకాశాన్ని కోల్పోయింది. ఫైనల్లో చెన్ బో యాంగ్, లియూ యీ జోడీ దక్షిణ కొరియాకు చెందిన సేయో సియుంగ్-జే, కిమ్ వోన్-హోతో తలపడనుంది.ఈ ఓటమితో బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో భారత బృందం ప్రయాణం ముగిసింది. గతంలో ఈ భారత జోడీ ఇండోనేషియా, సింగపూర్, చైనా ఓపెన్ టోర్నమెంట్‌లలో క్వార్టర్ ఫైనల్స్ వరకు చేరుకుంది. సాత్విక్-చిరాగ్ జోడీకి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇది రెండో కాంస్య పతకం. గతంలో 2022లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కూడా ఈ జోడీ కాంస్య పతకాన్ని గెలుచుకుంది.





# క్లాసెన్ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్

**భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా**

భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా టీ20 ఫార్మాట్‌లో ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ముగ్గురు బ్యాటర్ల పేర్లను వెల్లడించారు. ఈ జాబితాలో ఇద్దరు భారతీయులు, ఓ దక్షిణాఫ్రికా ఆటగాడు ఉన్నారు. సురేష్ రైనా ప్రకారం.. దక్షిణాఫ్రికాకు చెందిన హెన్రిచ్ క్లాసెన్ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్. ఆ తర్వాత తన జాబితాలో అభిషేక్ శర్మ, భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌లకు చోటు కల్పించాడు.సురేష్ రైనా ప్రకారం.. హెన్రిచ్ క్లాసెన్‌ను అత్యుత్తమ బ్యాటర్‌గా ఎంచుకోవడానికి ప్రధాన కారణం, అతను అరుదైన రీతిలో సిక్సర్లు కొట్టగల సామర్థ్యం. ఇది అతన్ని ఇతర బ్యాటర్ల నుంచి ప్రత్యేకంగా నిలబెడుతుంది. క్లాసెన్ దక్షిణాఫ్రికా తరఫున, అలాగే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో తన విధ్వంసకర బ్యాటింగ్‌తో కీలక ఆటగాడిగా నిలిచాడు. క్లాసెన్ ఈ ఏడాది ప్రారంభంలో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, అతని దూకుడు బ్యాటింగ్ ఇప్పటికీ గుర్తింపు పొందింది.ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ పవర్-హిట్టింగ్‌తో భారత జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. అభిషేక్ శర్మ ఇప్పటికే తన చిన్న టీ20 కెరీర్‌లో రెండు సెంచరీలు సాధించాడు. అభిషేక్ శర్మ ఇంగ్లాండ్‌పై వాంఖడేలో సాధించిన సెంచరీని కూడా రైనా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఐపీఎల్‌లో అతని అద్భుత ప్రదర్శన, నిలకడగా పరుగులు సాధించడం కూడా ఈ జాబితాలో చేర్చడానికి ప్రధాన కారణం.భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నారు. సూర్య వద్ద ఉన్న అనేక రకాలైన వినూత్న షాట్‌లు, అన్ని దిశల్లోనూ బంతిని బాదగలిగే సామర్థ్యం అతన్ని ఈ జాబితాలో చేర్చడానికి దోహదపడ్డాయి. సూర్యకుమార్ టీ20 ఫార్మాట్‌లో ఇప్పటికే తన ముద్ర వేశాడు. భారత జట్టుకు ఒక కీలక సభ్యుడిగా కొనసాగుతున్నాడు.

ఈ ముగ్గురు బ్యాటర్లు టీ20 క్రికెట్‌లో తమ విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. వీరిలో హెన్రిచ్ క్లాసెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, అతని ఆటతీరు ఇంకా ప్రశంసలు అందుకుంటోంది. అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ ఇద్దరూ ప్రస్తుతం భారత టీ20 జట్టులో కీలక సభ్యులుగా కొనసాగుతున్నారు.



# భారత హాకీ జట్టు అద్భుతమైన ప్రదర్శన

## ఆసియా కప్ ఫైనల్స్ దిశగా అడుగులు

బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరుగుతున్న ఆసియా కప్ 2025లో భారత హాకీ జట్టు అద్భుతమైన ప్రదర్శన కొనసాగుతోంది. భారత జట్టు తమ రెండో పూల్ మ్యాచ్‌లో జపాన్‌ను 3-2 తేడాతో ఓడించి.. వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో భారత జట్టు తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్(5వ, 46వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించగా.. మన్‌దీప్ సింగ్ (4వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు.జపాన్ జట్టు తరఫు కవాబే కోసేయ్(38వ, 59వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేశాడు. ఈ మ్యాచ్ భారత గోల్ కీపర్ కృష్ణ బహదూర్ పాఠక్ కెరీర్లో 150వ అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. ఈ విజయం అతని కెరీర్లో ఒక ప్రత్యేక సందర్భాన్ని మరింత ప్రత్యేకం చేసింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు కృష్ణ బహదూర్ పాఠక్‌ను సత్కరించారు.భారత జట్టు ఆరంభం నుంచే దూకుడుగా ఆడి, మొదటి క్వార్టర్‌లోనే రెండు గోల్స్ సాధించింది. నాలుగో నిమిషంలో మన్‌దీప్ సింగ్ అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేయగా, ఐదో నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేసి భారత్‌ను 2-0 ఆధిక్యంలో ఉంచాడు. రెండో క్వార్టర్‌లో ఇరు జట్లు గోల్ చేయలేకపోయాయి. మూడో క్వార్టర్‌లో జపాన్ జట్టు అటాకింగ్ గేమ్‌ను ప్రదర్శించింది. క్వార్టర్ 8వ నిమిషంలో కవాబే కోసేయ్ గోల్ చేసి స్కోర్‌ను 2-1కి తగ్గించాడు. నాలుగో క్వార్టర్ మొదలవగానే భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. దీనిని హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలిచి భారత్ ఆధిక్యాన్ని 3-1కి పెంచాడు. జపాన్ జట్టు పోరాటాన్ని కొనసాగిస్తూ, మ్యాచ్ ముగియడానికి రెండు నిమిషాల ముందు కవాబే కోసేయ్ మరో గోల్ చేశాడు. దీంతో స్కోర్ 3-2గా నిలిచింది. చివరి వరకు భారత్ ఆధిక్యాన్ని కాపాడుకుని విజయం సాధించింది.ఈ విజయంతో భారత జట్టు తమ గ్రూపులో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇప్పుడు భారత్ తమ చివరి పూల్ మ్యాచ్‌లో సెప్టెంబర్ 1(సోమవారం) నాడు కజకిస్థాన్‌తో తలపడనుంది. ఈ టోర్నమెంట్ విజేతకు వచ్చే ఏడాది నెదర్లాండ్స్, బెల్జియంలో జరగబోయే హాకీ ప్రపంచ కప్ లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఇది ఆసియా కప్ హాకీ టోర్నమెంట్ 17వ ఎడిషన్. భారత జట్టు ఇప్పటి వరకు మూడు సార్లు ఆసియా కప్ గెలుచుకుంది (2003, 2007, 2017). అత్యధికంగా సౌత్ కొరియా ఐదుసార్లు, పాకిస్తాన్ మూడుసార్లు ఈ టైటిల్‌ను గెలుచుకున్నాయి. భద్రతా కారణాల వల్ల ఈ టోర్నమెంట్ నుంచి పాకిస్తాన్ తప్పుకుంది.

**ఆసియా కప్ కోసం భారత హాకీ జట్టు:**

**గోల్ కీపర్స్:** కృష్ణ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కేరా.

**డిఫెండర్స్:** హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), జర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్ రోహిదాస్, జుగ్‌రాజ్ సింగ్, సుమిత్, సంజయ్.

**మిడ్‌ఫీల్డర్స్:** మన్‌ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, రాజ్ కుమార్ పాల్, హార్దిక్ సింగ్, రాజిందర్ సింగ్.

**ఫార్వర్డ్స్:** మన్‌దీప్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్, శిలానంద్ లాక్రా, దిల్‌ప్రీత్ సింగ్.

# ఘాటిలో అనుష్క గారి విశ్వరూపం చూపించాం

## మంచి కథ, పెర్ఫార్మెన్స్, స్ట్రాంగ్ ఎమోషన్స్‌తో వస్తున్న ఘాటి తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది: ప్రెస్ మీట్‌లో డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి

క్వీన్ అనుష్క శెట్టి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటి. విక్రమ్ ప్రభు మేల్ లీడ్ గా నటించిన ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. UV క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. ఇప్పటికే అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో సినిమా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.

ప్రెస్ మీట్ లో డైరెక్టర్ క్రిష్ మాట్లాడుతూ...అందరికీ నమస్కారం. కొన్ని కథలు చాలా సహజంగా, పచ్చిగా, పేలడానికి సిద్ధంగా ఉన్నట్లుగా ఉంటాయి. ఘాటి అలాంటి కథ. తూర్పు కనుమలు, ఆ పర్వత శ్రేణులు అక్కడ ఉన్న ఒక తీవ్రమైన భావోద్వేగాలు చాలా గట్టి మనుషులు గొప్ప మనస్తత్వాలు ఇవన్నీ కలగలిపి ఒక మంచి కథ చెప్పడానికి ఆస్కారం దొరికింది. చింతకింద శ్రీనివాసరావు గారు గొప్ప రచయిత. మొదటిగా ఆయన నాకు ఈ ప్రపంచం గురించి చెప్పారు చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. నేను స్వీటీ వేదం సినిమాలో కలిసి పనిచేశాం. అందులో సరోజ పాత్రను పోషించింది. ఇప్పుడు ఘాటిలో శీలావతిగా మనందరి ముందుకు రాబోతుంది. అరుంధతి, సరోజ, దేవసేన, భాగమతి.. ఇలా ఎన్నో ఐకానిక్ క్యారెక్టర్స్ అనుష్క చేసింది. ఘాటిలో కూడా చాలా ఎక్స్ట్రార్డినరీగా చేసింది. తను సూపర్ స్టార్ డమ్ లో వుంది. వేదం నుంచి ఇప్పటివరకు స్టార్ డమ్ లో అనేక రెట్లు ఎదిగింది. తన మనసు మాత్రం అలాగే ఉంది. ఈ సినిమా కథ చెప్పగానే చాలా అడ్వంచర్ తో కూడుకున్న మూవీ తప్పకుండా చేద్దాం అని చెప్పింది. అనుష్క విశ్వరూపాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం. సెన్సార్ కి ఇచ్చేముందు కాపీ చూసుకుని అనుష్కకి ఫోన్ చేశాను. తను ఇప్పటివరకు చేసిన సినిమాల్లో ఇది ఒక ఫైనెస్ట్ పెర్ఫార్మెన్స్ అని చెప్పాను. అదే మాట ఆడియన్స్ కచ్చితంగా చెప్తారు. ఈ కథ రాస్తున్నప్పుడే శీలావతి పాత్ర అనుష్క గారు చేయాలని నేను మా ప్రొడ్యూసర్ రాజీవ్ గారు సాయిబాబా గారు విక్రమ్ ప్రమోద్ వంశీ డిసైడ్ అయ్యాం. దేశిరాజు క్యారెక్టర్ లో విక్రమ్ ప్రభు గారిని ఊహించుకుని రాశాను. ఆయన ప్రతి సినిమాలో ఒక డిఫరెంట్ క్యారెక్టర్ చేస్తారు.ఇందులో కూడా చాలా అద్భుతంగా ఉంటుంది. గ్రేట్ పెర్ఫార్మన్స్ ఇచ్చారు. ఆయనే ఈ పాత్రకు తన సొంత వాయిస్ తో డబ్బింగ్ చెప్పుకున్నారు. అలాగే కుందుల నాయుడు క్యారెక్టర్ కి చైతన్య పర్ఫెక్ట్ యాప్ట్. ఈ సినిమాలో పెర్ఫార్మెన్స్ లన్నీ ఎక్స్ట్రార్డినరీ. జగపతిబాబు గారి క్యారెక్టర్ ఈ సినిమాకి ఒక సూత్రధారిలాగా ఉంటుంది. మొదటి సీను, చివరి సీను ఆయనతోనే ఉంటుంది. ఒక మంచి కథకి మంచి నటీనటులు టెక్నీషియన్స్ దొరకడం అదృష్టం. తోట తరణి గారు లాంటి ప్రొడక్షన్ డిజైనర్. ఐశ్వర్య గారు కాస్ట్యూమ్స్, సాయిమాధవ్ బుర్ర గారి డైలాగులు ఇవన్నీ అద్భుతంగా ఉంటాయి. ఘాటి సినిమాకి హార్ట్ బీట్ లాంటిది మ్యూజిక్. సాగర్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. ఇందులో యాక్షన్ సీక్వెన్స్ చాలా ఎక్సైటింగ్ గా ఉంటాయి. కనీ, వినని పాత్రలు ఈ ఘాటిలో చూస్తారు. చాలా మంచి సినిమా తీశాం. ఘాటి సినిమాలో ఒక అందమైన సోల్ ఉంది. ఆడియన్స్ ఆ సోల్ ని మనసులో నింపుకుని వెళ్తారు. సెప్టెంబర్ 5న తప్పకుండా అందరూ ఈ సినిమాని థియేటర్స్ లో చూడండి.



యాక్టర్ జగపతిబాబు మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. అనుష్క స్వీటీ అని మనందరికీ తెలుసు కానీ. ఈ సినిమాల్లో చాలా ఘాటుగా ఉండబోతుంది. అన్ని రియల్ లొకేషన్స్ లో చేసిన సినిమా ఇది. ఒకసారి ప్రయాణిస్తున్న కారు బురదలో ఇరుక్కుపోయింది. దాదాపు ఒక 40 నిమిషాలకు రోడ్డు మీదే నిలిచి ఉండిపోయాం. అలాంటి లోకేషన్స్ లో చేశాం. ఈ సినిమా జర్నీ అంత చాలా ఎంజాయ్ చేసాం. ఈ ప్రెస్ మీట్ కి రావడానికి ప్రధాన కారణం క్రిష్ గారు రాజీవ్. చాలా అద్భుతమైన సినిమా తీశారు. ఈ సినిమా గురించి చెప్పాలని వచ్చాను. ఈ సినిమాలో నేను పోలీస్ క్యారెక్టర్ చేస్తున్నాను. చాలా డిఫరెంట్ క్యారెక్టర్. మంచి చేస్తానా చెడు చేస్తానా ఏం చేస్తానో నాకే తెలియని క్యారెక్టర్. డైరెక్టర్ క్రిష్ గారు చాలా అద్భుతంగా రాశారు. నేను క్రిష్ ఎప్పటినుంచో మంచి ఫ్రెండ్స్. ఫైనల్ గా ఈ సినిమాతో కలిసి వర్క్ చేసాం. చాలా ఎంజాయ్ చేస్తూ చేసిన సినిమా ఇది. రాజీవ్ నిజాయితీ ఉన్న ప్రొడ్యూసర్. తన మాటంటే మాటే. ఈ సినిమా రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్.

హీరో విక్రమ్ ప్రభు మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. ఘాటీ నా ఫస్ట్ తెలుగు సినిమా. నాకు ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ క్రిష్ గారికి, నిర్మాత రాజీవ్ గారికి ధన్యవాదాలు. దేశి రాజు క్యారెక్టర్ లో నన్ను ఊహించుకొని రాయడం చాలా ఆనందాన్నిచ్చింది. అనుష్క గారికి నేను పెద్ద ఫ్యాన్ ని. అనుష్క గారితో కలిసి నటించడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. జగపతి బాబు గారు చైతన్య రావు.. అందరితో కలిసి నటించడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. చైతన్య తన క్యారెక్టర్ లో జీవించేసారు. రాజీవ్ చాలా జెన్యూన్ ప్రొడ్యూసర్. ఆయన టీం విజన్ చాలా అద్భుతంగా అర్థం చేసుకున్నారు. ఈ టీంలో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సెప్టెంబర్ 5న ఘాటీ వస్తుంది. అందరూ థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను.

యాక్టర్ చైతన్య రావు మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఘాటీ సెప్టెంబర్ 5న థియేటర్స్ లోకి రాబోతోంది. మైత్రి డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేస్తున్నారు. మన అందరి ఫేవరెట్ క్వీన్ అనుష్క గారు చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్తో వస్తున్నారు. టీజర్ సాంగ్స్ చూస్తే మీకు అర్థమయ్యే ఉంటుంది. అనుష్క గారి అభిమానులుగా ఆమెను అలాంటి అద్భుతమైన క్యారెక్టర్ లో చూడడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. నాకు క్రిస్ గారు అంటే చాలా ఇష్టం. క్రిస్ గారి సినిమాలో ఒక అద్భుతమైన పాత్ర చేయడం కళ నెరవేరినట్లు అయింది. చాలా పవర్ఫుల్ రోల్ చేశాను. ఈ సినిమా టీజర్ చూసినప్పుడు నా క్యారెక్టర్ కి వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్నిచ్చింది. సినిమాలో ఇంకా అద్భుతంగా ఉంటుంది. నా క్యారెక్టర్ ని స్క్రీన్ మీద చూసుకున్నప్పుడు చాలా కొత్తగా అనిపించింది. నాలో ఒక కొత్త కోణాన్ని చూపించిన దర్శకుడు క్రిష్ గారికి ధన్యవాదాలు. భవిష్యత్తులో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. జగపతిబాబు గారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది. విక్రమ్ చాలా వైవిధ్యమైన సినిమాల చేస్తుంటారు. వారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా చాలా హ్యాపీగా ఉంది. అనుష్క గారితో కలిసి వర్క్ చేయడం డ్రీమ్ కం ట్రూ మూమెంట్. సెప్టెంబర్ 5న ఘాటి థియేటర్స్ లోకి వస్తుంది. సినిమా ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ కాబోతోంది.

ప్రొడ్యూసర్ రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఘాటిలో అనుష్కని రియల్ క్వీన్ గా చూస్తారు. విక్రమ్ గారు అద్భుతమైన పర్ఫామెన్స్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులో భాగమైన జగపతి బాబు గారికి చైతన్యకి ధన్యవాదాలు. చాలా అద్భుతమైన సినిమా చేశాము. ఈ సినిమాపై మేమందరం చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాము. సెప్టెంబర్ 5న థియేటర్స్ లో కలుద్దాం.

## ఆటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ నూతన చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేసిన సందీప్ కిషన్..

### బర్త్ డే సందర్భంగా సెప్టెంబర్ 17న టైటిల్, గ్లింప్స్ రిలీజ్

ఆటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ మొదటి చిత్రంలోనే తన నటనతో అందరినీ ఆకట్టుకున్నారు. ఇక ఇప్పుడు ‘బరాబర్ ప్రేమిస్తా’ అంటూ ఆడియెన్స్‌ను మరోసారి మెప్పించేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే వదిలిన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు ఆడియెన్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. ఇక ఇప్పుడు చంద్రహాస్ నూతన చిత్రానికి సంబంధించిన అప్డేట్ వచ్చింది. ఈ మేరకు సందీప్ కిషన్ ఈ కొత్త చిత్రానికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు.

ఈ కాన్సెప్ట్ పోస్టర్ చూస్తుంటే ఇదేదో రెగ్యులర్ కమర్షియల్ చిత్రంలా కనిపించడం లేదు. ఈ కథలో దేశ భక్తికి సంబంధించిన అంశాల్ని కూడా జోడించినట్టుగా అనిపిస్తోంది. ఐదు రూపాయల బిళ్ల, వాటి చుట్టూ ఉన్న బుల్లెట్లు, పోస్టర్‌ను డిజైన్ చేసిన తీరు చూస్తుంటే మంచి పవర్ ఫుల్ స్టోరీతోనే సినిమా రాబోతోందని అర్థం అవుతోంది. జైరామ్ చిటికెల ఈ మూవీకి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఈ చిత్రాన్ని పివికె ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. చంద్రహాస్ బర్త్ డే సందర్భంగా సెప్టెంబర్ 17న ఈ మూవీకి సంబంధించిన టైటిల్, గ్లింప్స్‌ను రిలీజ్ చేయబోతోన్నారు.




## నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల, సుధాకర్ చెరుకూరి, SLV సినిమాస్ 'ది ప్యారడైజ్' కోసం హాలీవుడ్ కొలాబరేషన్

నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ గ్లోబల్ యాక్షనర్ 'ది ప్యారడైజ్' లో ఇంతకు ముందు ఎన్నడూ చేయని ఇంటెన్స్, ఫియర్లెస్ట్ క్యారెక్టర్ చేస్తున్నారు. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, SLV సినిమాస్ బ్యానర్ పై నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. రా స్టేట్మెంట్, రెండు పవర్ ఫుల్ ఫస్ట్-లుక్ పోస్టర్లతో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసిన ఈ చిత్రం బిహైండ్ ది సీన్స్ 'స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్' గ్లింప్స్ తో అంచనాలని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళింది.

'ది ప్యారడైజ్' ను గ్లోబల్ సినిమా విజన్ తో చాలా గ్రాండ్ స్కేల్ లో రూపొందిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ తో మేకర్స్ యూనివర్సల్ విజన్ అందరికీ అర్థమైయింది. మల్టీ లాంగ్వేజ్ రిలీజ్, బోల్డ్ ప్రమోషన్స్ అన్నీ గ్లోబల్ మూవీ దిశగానే సాగుతున్నాయి.

లేటెస్ట్ అప్డేట్ ఏమిటంటే.. ది ప్యారడైస్ టీం హాలీవుడ్‌లోని #ConnekktMobScene ఎగ్జిక్యూటివ్ VP ఆఫ్ క్రియేటివ్ కంటెంట్ అలెగ్జాండ్రా ఈ. విస్కోంటిని కలసి సినిమా కోసం కొలాబరేషన్ డిస్కస్ చేస్తున్నారు. ఈ డెవలప్మెంట్ వాళ్ల ఇంటర్నేషనల్ ప్లాన్స్‌ని మరింత స్ట్రాంగ్‌గా ప్రజెంట్ చేస్తోంది.

మొదటినుంచే ఈ ప్రాజెక్ట్‌ని రీజనల్ సినిమా లాగా కాకుండా, పాన్-వరల్డ్ మూవీలా ట్రీట్ చేస్తున్నారు. అగ్రెసివ్ ప్రమోషన్స్ తో ఇప్పటి నుంచే అన్ని లాంగ్వేజెస్‌లో, మార్కెట్స్‌లో, ఆడియన్స్‌లో బజ్ క్రియేట్ అయ్యింది. 2026 మార్చిలో వరల్డ్‌వైడ్ రిలీజ్‌కి రెడీ అవుతుండగా, ఇప్పటికే ట్రేడ్ సర్కిల్స్ ది ప్యారడైస్ ని ఇండియా నుంచి వచ్చే మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ గా చెబుతున్నారు.ఇంటర్నేషనల్ వెర్షన్‌లను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి ఇండియాలో భారీ సంఖ్యలో పాలోవర్స్ ని కలిగి ఉన్న ప్రఖ్యాత హాలీవుడ్ నటుడిని తీసుకురావడానికి టీం చర్చలు జరుపుతోంది. ఇది ప్రాజెక్ట్‌కి ఇంకో గ్లోబల్ డైమెన్షన్‌ని జోడిస్తుంది. ఈ సినిమాలో బాలీవుడ్ యాక్టర్ రాఘవ్ జుయాల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. సినిమాటోగ్రఫీకి సి.హెచ్. సాయి, మ్యూజిక్‌కి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్, ఎడిటింగ్‌కి నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్‌కి అవినాష్ కొల్లా పని చేస్తున్నారు.ది ప్యారడైస్ 2026 మార్చి 26న థియేటర్లలోకి రానుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ మొత్తం ఎనిమిది భాషల్లో విడుదల కానుంది.



## హోమ్ టౌన్ శృంగేరి సందర్శించి అక్కడి చారిత్రక, ఆధ్యాత్మిక విశేషాలు షేర్ చేసిన హీరోయిన్ నభా నటేష్



**సోషల్ మీడియాలో బిజీగా ఉంటూ తన పర్సనల్, ప్రొఫెషనల్ విషయాలు షేర్ చేస్తుంటుంది హీరోయిన్ నభా నటేష్. ఆమె తాజాగా తన సొంత పట్టణం శృంగేరికి వెళ్లింది. అక్కడి ప్రసిద్ధ దేవాలయాలు సందర్శించి, ఆ విశేషాలు ఇన్ స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసింది. తన కుటుంబ సభ్యులతో కలిసి తాను తీసుకున్న ఫొటోస్ ను నభా పోస్ట్ చేసింది. ఇన్ స్టాగ్రామ్ పోస్ట్ లో**

నభా నటేష్ స్పందిస్తూ – శృంగేరి, నా జన్మస్థలం. రామాయణానికి పూర్వపు పవిత్రమైన చరిత్ర ఈ నగరానికి ఉంది. మహర్షుల తపస్సులచే పవిత్రమైన భూమి ఇది. దశరథుడితో పుత్రకామేష్టి యాగం చేయించిన ఋషి ఋష్యశృంగుడికి కూడా ఈ నగరంతో అనుబంధం ఉంది. త్రేతాయుగానికి అనుసంధానించే గొప్ప చరిత్ర గల నగరమిది. జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులు తన మొదటి అమ్నయ పీఠాన్ని స్థాపించడానికి శృంగేరిని ఎంచుకున్నారు. ఆయన జ్ఞాన స్వరూపమైన శారదాంబ దేవతను ప్రతిష్ఠించి, శృంగేరిని అద్వైత వేదాంతానికి ప్రసిద్ధ ప్రాంతంగా మార్చారు. వేదాలు, కళలకు నాకు పరిచయం చేసింది శృంగేరి. చిన్నతనం నుంచి ఈ పవిత్ర పట్టణం అందించిన చరిత్ర, సంస్కృతి, జ్ఞానం నాకెంతో ప్రేరణ ఇచ్చాయి. పెద్దయ్యాక భారతీయ పురాణాలు, ఆధ్యాత్మిక ఆలోచనల పట్ల నాకున్న ఇష్టం మరింత పెరిగింది. దట్టమైన అడవుల మధ్య ఉండి, భారీ వర్షపాతానికి ప్రసిద్ధి చెందిన శృంగేరి సహనం, అంతర్గత బలాన్ని కలిగిస్తుంది. ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ నా చిన్ననాటి జ్ఞాపకాలు పలకరిస్తూ నిత్యం మార్గదర్శనం చేస్తుంటాయి. అని పేర్కొంది.

## ముగ్గురు పిల్లలను కనాలని ఉంది..

**జాన్వీ కపూర్ ప్రస్తుతం స్టార్ హీరోలకు జోడీగా నటిస్తోంది. బ్యాక్ టు బ్యాక్ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ తో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. రొటీన్ కు భిన్నమైన పాత్రలు పోషిస్తూ ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలో తాజాగా పరమ్ సుందరి అనే బాలీవుడ్ ఫిల్మ్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆగస్టు 29నే ఈ చిత్రం హిందీతో పాటు ఇతర భాషల్లోనూ గ్రాండ్ గా విడుదలైంది. అయితే ఈ చిత్రం పరమ్ సుందరి ప్రమోషన్స్ లో జాన్వీ కపూర్ చేసిన రీసెంట్ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.**



పెళ్లి అయిన తర్వాత తన కిడ్స్ ప్లానింగ్ గురించి ఓపెన్ కామెంట్స్ చేయడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే గతంలోనే జాన్వీ కపూర్ బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తనకు భవిష్యత్ లో పుట్టబోయే పిల్లల గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. ఇక తాజాగా పరమ్ సుందరి చిత్రం ప్రమోషన్స్ లో జాన్వీ కపూర్ ఆ కామెంట్స్ కు వివరణ ఇచ్చింది. అయితే గతంలో తాను ముగ్గురు పిల్లలను కనాలనుకుంటున్నట్లు హీరోయిన్ జాన్వీ కపూర్ ఓ సందర్భంలో తెలిపింది. దీనిపై తాజాగా పరమ్ సుందరి ప్రమోషన్లలో ఆమె స్పందించారు. ‘నా లక్కీ నంబర్ 3. అందుకే పెళ్లి తర్వాత ముగ్గురికి జన్మనిస్తా. వారిలో ఇద్దరు గొడవ పడుతున్నప్పుడు మూడో బిడ్డ ఎవరికి సపోర్ట్ చేస్తారో నేను చూడాలి. సందర్భాన్ని బట్టి వాళ్ల మద్దతు మారుతూ ఉంటుంది. ఇలా నా బిడ్డలందరూ ఒకరికొకరు సపోర్ట్ చేసుకుంటారు’ అంటూ చెప్పారు. ప్రస్తుతం బ్యాచిలర్ లైఫ్ ను ఎంజాయ్ చేస్తున్న జాన్వీ కపూర్ ఇలా పిల్లల గురించి మాట్లాడటం ఆసక్తికరంగా మారింది. ఈ సందర్భంగా జాన్వీ కపూర్ పెళ్లిపైనా కూడా చర్చ కొనసాగుతోంది. కానీ ప్రస్తుతం జాన్వీ కపూర్ కెరీర్ పైనే ఫోకస్ పెట్టడంతో పెళ్లికి ఇంకాస్త గ్యాప్ ఇచ్చే అవకాశం ఉంది. దీంతో జాన్వీ కపూర్ మరిన్ని చిత్రాల్లో నటించేందుకు ప్రయత్నిస్తోంది. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటోంది. ఇక పరమ్ సుందరి చిత్రంలో మలయాళం, తమిళ అమ్మాయిగా కనిపించి అలరించింది. బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో రూపుదిద్దుకున్న ఈ రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ కు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రివ్యూ దక్కడం విశేషం. తన పాత్ర ద్వారా జాన్వీ పూర్ ట్రోల్స్ కు గురైన తన పెర్ఫామెన్స్ ను ఆకట్టుకుందని ప్రేక్షకులు తెలుపుతున్నారు. ఈ చిత్రంలో హీరోగా బాలీవుడ్ స్టార్ సిద్ధార్థ్ మల్హోత్రా నటించడం విశేషం. ఛావా సినిమాను రూపొందించిన మ్యాడాక్ ఫిల్మ్స్ వారు నిర్మించడం విశేషం. దినేష్ విజన్ నిర్మాతగా వ్యవహరించారు. ఇక జాన్వీ కపూర్ తెలుగులో భారీ చిత్రాల్లో నటిస్తోంది. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంలో నటించింది. ప్రస్తుతం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన పెద్ది చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. 2026 మార్చిలో ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. మరోవైపు దేవర 2లో జాన్వీనే అలరించబోతోంది. ఇక అల్లు అర్జున్ – అట్లీ చిత్రంలోనూ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటించబోతోందని తెలుస్తోంది.

Editor, Printed, Published and Owned by Sudheer Kumar, Printed at Ratna Graphics , # 2-3-703/7, Thirumala Nagar Colony, Opposite : Police Line , Amberpet, Hyderabad-500013, Published At H.NO. 6-3-553/G2, ClassicCourt Anexa, opp: NKM Grand, Erramanzil Colony, Somajiguda, Hyderabad-500038, T.S. E-Mail: info.southindiatimes@gmail.com. ,Contact :9000657700. RNI NO. APTEL/2012/46756